RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM: HYDERABAD | సంపుటి: 00 | సంచిక: 0 | శనివారం, 30 నవంబర్, 2024 | ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న | అసోసియేట్ ఎడిటర్: కే రాజేంద్ర ప్రసాద్ | పేజీలు: 08 వెల: 2 రూ/-




## ఎన్నికల ఫలితాలు ఓ సవాల్

- ఐక్యంగా పార్టీని బలోపేతం చేయాలి: ఖర్గే దిశానిర్దేశం
- పార్టీ బలంగా ఉంటేనే వ్యక్తులు బలంగా ఉంటారు
- సంస్థాగతంగా కింది స్థాయి నుంచి పార్టీని బలపోతం చేయాలి
- జాతీయ సమస్యలే కాకుండా, రాష్ట్ర స్థాయి సమస్యలను కూడా ఎజెండా తీసుకుని పార్టీ పోరాటం సాగించాలి
- ఎన్నికలకు ఏడాదికి ముందే సన్నాహాలు చేసుకోవాలి
- విజయాలకు నూతన పద్ధతులను అవలభించాయి

## అత్యంత నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లలో

# తొలి ప్రాధాన్యం

- ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్‌లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని
- దివ్యాంగులు, వ్యవసాయ కూలీలు, సాగుభూమిలేని వారు, పారిశుద్ధ్య కార్మికులు.. ఇలా ప్రాధాన్యక్రమం ఎంచుకోవాలి
- తొలి దశలో సొంత స్థలాలున్న వారికే ప్రాధాన్యమిస్తున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



నిజామాబాద్

ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అత్యంత నిరుపేదలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. దివ్యాంగులు, వ్యవసాయ కూలీలు, సాగుభూమిలేని వారు, పారిశుద్ధ్య కార్మికులు.. ఇలా ప్రాధాన్యక్రమం ఎంచుకోవాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లపై తన నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. తొలి దశలో సొంత స్థలాలున్న వారికే ప్రాధాన్యమిస్తున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ విషయంలో గ్రామ కార్యదర్శితో పాటు మండల స్థాయి అధికారులను బాధ్యులను చేయడంతో పాటు అవసరమైన సాంకేతికతను వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు.

## మైలారం గుట్ట విధ్వంసంకు వ్యతిరేకంగా నూతన కమిటీ

అచ్చం పేట, తెలంగాణ సేన న్యూస్ : మైలారం గుట్ట విధ్వంసంకు వ్యతిరేకంగా నూతన కమిటీ ఏర్పాటు అయింది. ఈ కమిటీ కి అధ్యక్షులుగా గుండాల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గా గడ్డం దేవస్వామీ, ఉపాధ్యక్షులు గా లింగయ్య అంతయ్య, పాండు, చంద్రకళ, సహాయ కార్యదర్శిగా శ్రీనివాస్, శ్రీశైలం,కౌసల్య, రమేష్, కోశాధికారి గా గుండాల అనిల్ మరియు 14 మంది కార్యవర్గ సభ్యులు గా ఎన్నిక అయ్యారు. గుట్ట విధ్వంసం కాకుండా, జీవ వైవైద్యం ను కాపాడాలని, పర్యావరణాన్ని కాపాడాలని పక్షి సంపదను కాపాడాలని ఉద్యమించాలని నూతన కమిటీ సభ్యులు ప్రతినబూనారు. పౌర హక్కుల సంఘం, కుల నిర్మూలన సంఘం ఆధ్వర్యంలో మైలారం లో ఈ కార్యక్రమం జరిగింది.




## గ్రామ స్థాయి నాయకుల కృషి ఫలితమే



- నేడు రాష్ట్రము లో కాంగ్రెస్ ప్రభుత్వం
- టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ. మహేష్ కుమార్ గౌడ్
- అనుబంధ సంఘాల చైర్మన్ లలో చాలా మంది కార్పొరేషన్ చైర్మన్ లుగా చేసాము
- సేవాదల్, ఆర్.జి.పీఆర్.ఎస్ లు రాహుల్ గాంధీకి చాలా ఇష్టం
- ఇది రాజీవ్ గాంధీకి గ్రామ పంచాయతీలు అంటే ఇష్టం..

## సంక్షేమ హాస్టళ్లను గత ప్రభుత్వం పట్టించుకోలేదు

- గురుకులాల్లో కుట్రల వెనుక ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హస్తం ఉందని ఆరోపణ
- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, కేటీఆర్‌పై కొండా సురేఖ సంచలన ఆరోపణలు
- గతంలో గురుకులాల కార్యదర్శిగా పని చేశారన్న కొండా సురేఖ
- ఏదో తప్పు చేసినందువల్లే పదేపదే జైలుకు పోతానని కేటీఆర్ అంటున్నాడని వ్యాఖ్య



## లగచర్ల భూసేకరణ రద్దు




- తెలంగాణ సర్కార్ సంచలన నిర్ణయం..
- భూ సేకరణ చట్టం 2013లోని సెక్షన్ 93 ప్రకారం ఉపసంహరించుకున్నట్టు నోటిఫికేషన్ విడుదల
- గ్రామాలలో ప్రజల అభిప్రాయ సేకరణ తర్వాత భూసేకరణ రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రకటన

హైదరాబాద్

రేవంత్ సర్కార్ సంచలన నిర్ణయం తీసుకుంది. లగచర్ల భూసేకరణ రద్దు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. వికారాబాద్ జిల్లా లగచర్ల భూ వివాదంలో గిరిజనుల ఆందోళనకు ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఈ మేరకు భూసేకరణ రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఫార్మా విలేజ్ కోసం దుద్యాల మండలం లగచర్లలో భూసేకరణను నిలిపివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. భూ సేకరణ చట్టం 2013లోని సెక్షన్ 93 ప్రకారం ఉపసంహరించుకున్నట్టు నోటిఫికేషన్ విడుదల చేసింది. గ్రామాలలో ప్రజల అభిప్రాయ సేకరణ తర్వాత భూసేకరణ రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రకటన చేశారు. ఆయా గ్రామాల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో రేవంత్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అసలేం జరిగిందంటే.. లగచర్లలో ఫార్మా విలేజ్ ఏర్పాటును



## ‘ఆప్’తో పొత్తుకు నో

- ఒంటరి పోరుకు కాంగ్రెస్ నిర్ణయం
- ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ
- ఏ పార్టీతోనూ పొత్తులుండవని స్పష్టం
- ఎన్నికల అనంతరమే ముఖ్యమంత్రి ఎవరనే దానిపై కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ నిర్ణయం

## ఈ కాంగ్రెస్ ప్రభుత్వం లేకి బుద్ధితో వ్యవహరిస్తోంది



- తెలంగాణ జాతి వ్యథను రేపటి తరానికి నరనరాన ఎక్కించాలి
- ప్రతి జాతి తన ఘనమైన వైభవాన్ని పోరాటాలను, త్యాగాలను, విజయాలను కథగానో పాటల రూపంలోనూ నిత్యం తెలియజేస్తూనే ఉంటేనే తర్వాతి తరాలకు తెలుస్తోంది
- పోరాటాల గొప్పతనాన్ని చెప్పుకునే ప్రయత్నం చేస్తుంది
- కాంగ్రెస్ ప్రభుత్వానిది లేకి బుద్ధి.. నిప్పులు చెరిగిన కేటీఆర్
- బంజారా ఆడబిడ్డలు తమ వేషధారణలో సంప్రదాయంగా దీక్షా దివస్‌లో పాల్గొనడానికి వస్తుంటే క్యాన్సర్ హాస్పిటల్ నుంచి ఇక్కడి వరకు వీధి దీపాలు ఆర్పేశారు.

హైదరాబాద్

మన కథను, తెలంగాణ జాతి వ్యథను రేపటి తరానికి నరనరాన ఎక్కించాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నది అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. లేకపోతే మళ్లీ మన తెలంగాణ జాతి పరాయి దండయాత్రలో ఓడిపోయే ప్రమాదం ఉన్నది. అది కాంగ్రెస్ ప్రభుత్వం దాడి రూపంలో కనబడుతుంది మనకు అని కేటీఆర్ తెలిపారు. దీక్షా దివస్ సందర్భంగా తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ప్రసంగించారు. ప్రతి జాతి తన ఘనమైన వైభవాన్ని పోరాటాలను, త్యాగాలను, విజయాలను కథగానో పాటల రూపంలోనూ నిత్యం తెలియజేస్తూనే ఉంటేనే తర్వాతి తరాలకు తెలుస్తోంది. వీరులను, వీరగాథలను, వీరోచిత యుద్ధాలను నిత్యం స్మరించుకుంటూ ప్రతి జాతి, ప్రతి దేశం తన ఉనికిని, అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి ఉడుకు నెత్తురున్న యువతకు ఆ పౌరుషాన్ని నూరిపోసే ప్రయత్నం చేస్తోంది. పోరాటాల గొప్పతనాన్ని చెప్పుకునే ప్రయత్నం చేస్తుంది. రామాయణం, మహాభారత ఇతిహాసాలను పద్యాలుగా, నాటకాలుగా, గ్రంథాలుగా ప్రతి తరాన్ని చేరి భారత జాతిని ఐక్యంగా నిలబెట్టాయి. అదే మాదిరిగా తెలంగాణ జన సంప్రదాయంలో ఒగ్గు కథలు, బుర్ర కథలు, యక్షగానాలు, బతుకమ్మ పాటలు,

తెలంగాణ సేన



# సంపాదకీయం

## 'మహా' సునామీ మిగిల్చిన సంశయాలు

మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని మహాయుతి కూటమి విజయానికి నేను ఆశ్చర్యపోలేదు అలాగే విజయావకాశాలు పుష్కలంగా ఉన్న ప్రతిపక్ష ఎమ్‌వీఏ కూటమి ఓడిపోవడం కూడా నన్ను విస్మయపరచలేదు అయినప్పటికీ సునామీ లాంటి మహాయుతి విజయాన్ని నేను అర్థం చేసుకోలేక పోతున్నాను. నా రాజకీయ ఇంగితజ్ఞానం గానీ, రాజనీతిశాస్త్ర పరిజ్ఞానం గానీ మహారాష్ట్ర ఎన్నికల అంతిమ ఫలితాలను అర్థం చేసుకోవడానికి తోడ్పడం లేదు! విజేతకు తోడ్పడిన విజయ బలవర్ధకాలు ఏమిటి అని నన్ను నేను ప్రశ్నించుకోక తప్పలేదు. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలపై సంశయాలు నెలకొనడమనేది చాలా తీవ్ర విషయం. అధికారిక ఎన్నికల ఫలితాలను ప్రశ్నించవచ్చు. అయితే అది కొన్ని ప్రాథమిక పరీక్షలలో నెగ్గవలసిన అవసరమున్నది: ఆ ఫలితాలకు దారితీసిన బలమైన కారణాలను వివరించాల్సిన అవసరమున్నదా? పలువురు ఇస్తున్న వివరణలు నమ్మదగినవి కావా? ఈ రెండింటినీ నిశితంగా పరిశీలిద్దాం మహారాష్ట్ర ఎన్నికలు అనేక విధాలుగా ఆశ్చర్యాన్ని గొలిపాయి. మహాయుతి విజయం విస్మయకరమైనదేగాక దిగ్భ్రాంతికరమైనది కూడా. నాలుగింట మూడు వంతుల సీట్లను ఆ కూటమి కైవసం చేసుకున్నది. దాని ఓట్ల వాటా 14 శాతం అధికంగా ఉన్నది. ఇటువంటి విజయాలు అరుదైనవి. అయితే అసాధ్యమైనవి కావు, ఇంతకుముందు వినని కూడా కాదు. మహారాష్ట్ర రాజకీయాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేసే అంశాలు అన్నీ ఆ ఎన్నికలలో కానరాకుండా పోవడం ఆ ఆశ్చర్యాన్ని మరింత అధికం చేస్తోంది. రాష్ట్రంలోని విభిన్న ప్రాంతాల మధ్య అభివృద్ధిపరంగా అసమానతలు, భిన్న కులాలలోని పార్టీల మధ్య ఉన్న వివిధ అంతరాలు అన్నిటినీ అదృశ్య హస్తం ఏదో మటు మాయం చేసినట్టుగా కనిపిస్తోంది. మహాయుతి విజయంలోని నాటకీయ స్వభావమూ విస్మయం కలిగిస్తోంది. 2024 లోక్‌సభ ఎన్నికలలో ఓట్ల లోటును భర్తీ చేసుకోవడమే కాకుండా 14 శాతం అధిక్యతను మహాయుతి సాధించింది. అదీ ఐదు నెలల్లో ఎలా సాధ్యమయింది? వైజ్ఞానిక మహారాష్ట్ర పాలక కూటమి విజయం భారతదేశ ఎన్నికల చరిత్రలో అపూర్వమైనదేమీ కాదు. మహారాష్ట్రలో ఎన్నికల చరిత్రను నిశితంగా చూస్తే ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ గణనీయమైన సీట్లు సాధించుకోగలగడానికి ఆస్కారం లేదు. ఈ కారణంగానే మహాయుతి విజయాన్ని ఎవరూ పసిగట్టలేక పోయారు. ఎన్నికల పవనాలు వేగంగా, అనూహ్యంగా ఆశ్చర్యదు దిశలో వీచాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే మహాయుతి విజయం నిజానికి ఒక ఎన్నికల గుగ్లీ,మహారాష్ట్రలో సంభవించిన దానికి సబబైన వివరణ ఏమైనా ఉన్నదా? కొన్ని ప్రామాణిక వివరణలను పరిశీలిద్దాం. తమకు లభించిన మంచి అవకాశాన్ని ఎమ్‌వీఏ నాయకులు వ్యర్థం చేసుకున్నారనేది వాటిలో ప్రధానమైనది. లోక్‌సభ ఎన్నికలలో చేకూరిన విజయంతో అమిత సంతృప్తితో ఉండిపోయి, వ్యర్థ కలహాలతో కాలం గడుపుతూ దూరదృష్టి లేకుండా వ్యవహరించారనేది ఎమ్‌వీఏ నేతలపై ఒక ప్రధాన ఆక్షేపణ. ఇది చాలవరకు నిజం. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఎమ్‌వీఏకు ఒక నైతిక స్థైర్యాన్నిచ్చాయి. సమష్టి మనుగడకు ఒక సుదృఢ ప్రాతిపదిక కల్పించాయి. అసెంబ్లీ ఎన్నికల సమరానికి సమాయత్తమయ్యేందుకు అనువైన పరిస్థితులను సృష్టించాయి. ప్రజలను సతమతం చేస్తున్న సమస్యలా? కొల్లలు. శిందే సేన, అజిత్ పవార్ ఎన్‌సీపీ, బీజేపీలతో కూడిన మహాయుతి ఒక రాజకీయ పాప ఫలం. సిగ్గు మాలిన ఎత్తుగడలతో శివసేన, ఎన్‌సీపీని బీజేపీ చీల్చింది. పరిణత రాజకీయవేత్తగా ఉద్ధవ్ ఠాక్రేకు ప్రజల్లో మంచి పేరు ఉన్నది. కోవిడ్ ఉపద్రవంలో మహమ్మారి బాధితులను ఆదుకోవడంలో ఆయన పాలనా దక్షత రుజువయింది. ఈ అనుకూలతలను ఉపయోగించుకునేందుకు ఎమ్‌వీఏ నాయకులు లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల మధ్య ఐదు నెలల కాలంలో చేసిందేమీ లేదు. సీట్ల పంపిణీపై సత్వరమే ఒక నిర్ణయానికి రాలేకపోయారు. ఎన్నికల వాగ్దానాలను ప్రకటించడంలో జాప్యం చేశారు. మరీ ముఖ్యంగా ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో తేల్చుకోలేక పోయారు. బీజేపీ ఎత్తుగడలకు పై ఎత్తుగడలు వేయలేకపోయారు. లోక్‌సభ ఎన్నికలలో పరాజయం నుంచి బీజేపీ నేతృత్వంలోని మహాయుతి సరైన పాఠాలు నేర్చుకున్నది. ఒక పటిష్ట పథకాన్ని రూపొందించుకుని సమర్థంగా అమలుపరిచింది. తమ పట్ల వివిధ వర్గాలలో ఉన్న వ్యతిరేకతను తటస్థం చేసింది. ప్రభుత్వ కోశాగారాన్ని ప్రజలకు తెరిచింది. లడ్కీ బహిన్‌తో సహా పలు సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టింది. ఓబీసీలను తన వెనుక సమీకరించుకుంది దళితులలో అట్టడుగున ఉన్నవారిని తన వైపునకు తిప్పుకోగలిగింది. సంఘ్ పరివార్ అంతా మహాయుతి వెనుక మోహరించింది. నకిలీ అభ్యర్థులను నిలబెట్టింది. బీజేపీకి గల అపార ధనశక్తి, మీడియా పలుకుబడిని పూర్తిగా వినియోగించుకున్నది. మరి ఎమ్‌వీఏని మహాయుతి ఎందుకు ఓడించిందో మీకు ఇంకా వివరించాలా? అసెంబ్లీ ఎన్నికలను మహాయుతి, ఎమ్‌వీఏ సంసిద్ధమైన తీరుల్లో చాలా తేడా ఉన్నది. లోక్‌సభ ఎన్నికలలో ఓట్ల లోటును భర్తీ చేసుకోవడంలోను, అదనంగా ఐదు శాతం ఓట్లను కోల్పోయే ప్రమాదాన్ని అధిగమించడంలోను మహాయుతి ఎందుకు సఫలమయిందో ఆ తేడా వివరం చేస్తుంది. ఈ కారణాలు అన్నీ ఓట్ల కైవసంలో మహాయుతి, ఎమ్‌వీఏపై ఆధిక్యత సాధించేందుకు తోడ్పడింది. అయితే ఎటువంటి ఆధిక్యత అది? నాలుగింట మూడు వంతుల సీట్లను స్వాధీనం చేసుకున్నది. ఓట్ల వాటాలో 14శాతం అధిక్యత! నేను హతాశుడిని అయ్యాను. ఇంత మహావిజయాన్ని మీడియా గానీ, ఓటర్ల సర్వేలు నిర్వహించినవారు గానీ, చివరకు విజేతలతో సహా రాజకీయ నాయకులుగానీ ముందుగా ఊహించలేకపోయారు. ఎవరూ నమ్మదగ్గంగా వివరించలేకపోతున్నారు. సరే, ఎన్నికల ఫలితాలు ఇప్పుడు అందరినీ విస్మయపరచడం పరిపాటి అయిపోయింది. ఒక నిర్దిష్ట పార్టీ హవా ఉధృతంగా ఉన్న ఎన్నికలు నాయకులు, పరిశీలకులు, విలేఖర్లు, ఓటర్ల సర్వేల నిర్వాహకులతో సహా ప్రతి ఒక్కరినీ విస్మయపరుస్తాయి. 1977లో ఉత్తర భారతావనిలో జనతా పార్టీ, 1985లో రాజీవ్‌గాంధీ, 2019లో వాయవ్య భారతంలో మోదీ సానుకూల పవనాలు ఎలా వీచాయో నేను చూశాను. ఎవరు గెలవగలరో ప్రతి ఒక్కరూ సులభంగా చెప్పగలిగేవిగా సదరు ఎన్నికలు ఉండేవి. ఆయా పార్టీలకు లభించగల సీట్లపై అంచనాలు అటూ ఇటూగా ఉండేవి. విజేత ఎవరో కచ్చితంగా చెప్పగలిగి ఉండేవాడు. అయితే మహారాష్ట్ర ఎన్నికలు ఇందుకు పూర్తిగా విరుద్ధమైనవి. వీటి గురించిన రాసినవారెవ్వరూ అంతిమ ఫలితాలను ఏ మాత్రం ఊహించలేకపోయారు. సంబంధిత అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకుని చూస్తే మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలకు ఏదో ఒక ప్రత్యేక ఉన్నట్టు అనిపిస్తుంది. అయితే ఆ ప్రత్యేక ఏమిటో సహేతుకంగా వివరించలేని పరిస్థితి! ఈవీఎమ్‌లను తప్పుపట్టడం తొందరపాటే అవుతుంది. అయితే ఈవీఎమ్‌లను ఉపయోగించిన తీరును ప్రశ్నించకుండా ఉండడమనేది అసాధ్యం. నేను ఒక దశాబ్ద కాలంగా ఈవీఎమ్ కుట్ర సిద్ధాంతాలను విమర్శిస్తూ వస్తున్నాను. ఈ విషయంలో నా స్నేహితులు, రాజకీయ సహచరులు నాతో ఏకీభవించేవారు కాదు. పోలింగ్‌లో పాల్గొన్న ఓటర్ల శాతంపై తొలి అంచనాలకు, అంతిమ ఫలితాలకు మధ్య ఉన్న అంతరం రిగ్గింగ్‌ను సూచిస్తున్నదనే అభిప్రాయాన్ని నేను ఇప్పటికీ అంగీకరించలేకున్నాను. అదే విధంగా ఈవీఎమ్ ద్వారా పోల్ అయిన ఓట్ల సంఖ్య, ఈవీఎమ్ ద్వారా గణించిన ఓట్ల సంఖ్య మధ్య వ్యత్యాసం కూడా ఎన్నికలలో ఏదో మోసం జరిగిందనడానికి సరైన రుజువు కాదు. ఈవీఎమ్‌లను అధికార పక్షానికి అనుకూలంగా దుర్వినియోగపరిచారని ఆరోపించేవారు తమ ఆక్షేపణలకు మరింత సబబైన ఆధారాలు చూపించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను అర్థం చేసుకోవడం చాలా కష్టం. కనిపించే అంశాల కంటే కనిపించని అంశాలే వాటిని ప్రభావితం చేశాయని అనిపిస్తోంది. తాము వంచనకు గురయ్యామన్న భావనను వ్యక్తం చేస్తున్నందుకు ప్రతిపక్షాలను తప్పుపట్టకూడదు. అయితే అయితే ఇండియా కూటమి ఈవీఎమ్ కుట్ర విషయాన్నే దృష్టి కేంద్రీకరించి, తన సొంత రాజకీయ వైఫల్యాలను ఉపేక్షించడంలోనే అసలు ప్రమాదం ఉంది. ఇండియా కూటమి తన వైఫల్యాలను చిత్తశుద్ధితో పరిశీలించుకోవడమనేది మన దేశంలో ప్రజాస్వామ్య మనుగడకు చాలా చాలా ముఖ్యం.

# తెలంగాణ సాధనకు బాటవేసిన కేసీఆర్ దీక్ష




మన కళ్ళతో మనం చూసిన ఉద్యమం స్వరాష్ట్ర ఉద్యమం. దీన్ని కనికట్టు చేసి కథలల్లి వక్రీకరించలేరు. 'కేసీఆర్ సచ్చుడో ...తెలంగాణ వచ్చుడో' అన్నది ఉద్యమ ట్యాగ్ లైన్. ముంబయ్, బొగ్గుబాయ్, దుబాయ్ వలస బతుకులు తెలంగాణ కన్నీటి గాథలు. నీళ్ళు లేని ఊళ్ళు, నెర్రలు బాసిన నేలలే తెలంగాణ చిత్రపటమైంది. నీళ్ళు, నిధులు, కొలువులు తెలంగాణ అస్తిత్వ జెండా. తీరొక్క తీరుగా ఉద్యమం మలుపులు తిరుగుతున్నా పట్టీ పట్టనట్లు నటించిన కుట్రాజకీయ పార్టీలను చరిత్ర మరిచిపోదు. తెలంగాణ బిడ్డల ఆకాంక్షలు గెలవాలంటే ఇక ఆమరణ నిరాహారదీక్ష తప్పదని గాంధేయ మార్గంలో చివరి పోరుకు శ్రీకారం చుట్టారు కల్వకుంట్ల చంద్రశేఖరరావు. నా మరణమైనా ఉద్యమ కదలికై ఉప్పొంగాలే, నా ఆమరణ దీక్ష ఉద్యమ ప్రాణం కావాలేనన్న దీక్షతో కదిలిన ఉద్యమకారుడు కేసీఆర్. ఆ బక్కమనిషి ఒంటి ప్రాణంతో ఎత్తిన పిడికిలితో ఆ 11 రోజులు తెలంగాణ ఉక్కిరి బిక్కిరైంది. స్వరాష్ట్ర ఉద్యమాన్ని మలుపు తిప్పింది. కేంద్రం తలకిందులైంది. 1956కు ముందు నుంచి 2014 జూన్ 2 తెలంగాణ అవతరణ వరకు తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాలపై జరగని కుట్రలు లేవు. ఆధిపత్య రాజకీయాల కుట్ర పూరిత రాజకీయాలతో 1969 ఉద్యమం నెత్తుటిమయమైంది. పెద్దమనుషుల ఒప్పందాలు ఉల్లంఘనలు అయినాయి. ఉద్యమాన్ని నిర్దాక్షిణ్యంగా అణిచివేసి తెలంగాణ అస్తిత్వం గొంతు నులిమిన కుట్రపూరిత రాజకీయాలను తుత్తునియలు చేసే మహాశక్తి కేసీఆర్ రూపంలో రాజకీయ ప్రక్రియగా తెలంగాణ ఉద్యమ జెండాను ఎత్తింది. 1956 తర్వాత పెరిగిన అసమానతలు, నీళ్ళు లేక భూములు ఎండిపోవటాలు, తెలంగాణకు నిధులు కేటాయించని ఆధిపత్య పాలనలు, ఆర్థికంతో పాటు సామాజిక సాంస్కృతిక ఆధిపత్యాలు, పెద్దమనుష్యుల ఒప్పందాల ఉల్లంఘనలు కేసీఆర్ చేపట్టిన ఉద్యమానికి ప్రాణాలయ్యాయి. 1950 నుంచి 2001 వరకు ఆధిపత్యం కింద నలిగిపోయిన తెలంగాణను రాజకీయ ప్రక్రియ ద్వారా కేసీఆర్ తట్టి లేపారు. 1960 దశకం తర్వాత సినిమా రంగం, రియల్ ఎస్టేట్, హాస్పిటాలిటీ, ప్రైవేట్ విద్య, కార్పోరేట్ ఆసుపత్రులు, రవాణా రంగాలు తెలంగాణలో తీవ్ర ప్రాంతీయ అసమానతలకు దారితీశాయి. 1950లో నాన్ ముల్కీ గోబ్యాక్‌గా ఎగిసిన ఉద్యమం ఆత్మగౌరవ తెలంగాణ ఉద్యమమైంది. కాని దాన్ని అణిచివేశారు. 1969-71 సంవత్సరాల్లో నెత్తుటేర్లలో ముంచారు. 1990 దశకంలో తెలంగాణ ఆర్థిక రాజకీయ సామాజిక సాంస్కృతిక రంగాలు పూర్తిగా ఆధిపత్య రాజకీయాల చేతుల్లోకి పోయాయి. ఈ దశకంలోనే తెలంగాణ సమస్యలు ప్రధానాంశాలుగా ముందుకొచ్చాయి. ఈ చారిత్రక సందర్భంలోనే 2001 ఏప్రిల్ 27న కేసీఆర్ నేతృత్వంలో టీఆర్ఎస్ ఏర్పడింది. కేసీఆర్ ఉద్యమ వ్యాప్తి విస్తృతంగా చేశారు. ఉద్యోగుల సమ్మెలు, విద్యాలయాలు కదనరంగాలుగా మారాయి. ప్రజాసంఘాలు తమ పాత్ర పోషించాయి. కేసీఆర్ రాజకీయ ప్రక్రియ ద్వారా దేశంలో 36 రాజకీయ పార్టీల మద్దతు కూడగట్టారు. ఆధిపత్యవాద రాజకీయ పార్టీల చేత జై తెలంగాణ అనిపించారు. తెలంగాణ ప్రజల గుండెల్లో గూడుకట్టుకున్న ఆకాంక్షలను మలిదశ ఉద్యమంలో రగిలించిన మహాశక్తిగా కేసీఆర్ నిలిచారు. నీళ్ళు నిధులు ఉద్యోగాల్లో జరిగిన దగాను చెప్పటమే గాక, తెలంగాణ ఆటపాట మాటలను ఎంత నిర్లక్ష్యం చేశారో కేసీఆర్ విప్పి చెప్పారు. తన నేలపై భాషా సంస్కృతులపై జరుగుతున్నదాడిని తిప్పికొడుతూ ఉద్యమం కన్నెర్ర జేసింది. టీఆర్ఎస్ రాజకీయ ప్రక్రియ నేతృత్వంలో ఈ నేల మీద ఉన్న అన్ని రాజకీయ పార్టీలను ఒక తాటిపైకి తీసుకురావటంలో కేసీఆర్ ఎత్తుగడలు, చొరవ, వ్యూహాలు, ప్రతివ్యూహాలు సామాన్యమైనవి కావు. ఉద్యమబలాన్నంతా రాజకీయ ప్రక్రియగా మలిచి కేంద్రంపై ఒత్తిడి తేవటానికి టీఆర్ఎస్ బలమైన సాధనంగా పనిచేసింది. తెలంగాణ ప్రజల్లో ఉన్న పౌరుషాన్ని మండించటంలో కేసీఆర్ అగ్గిమంటై నిలిచారు. తెలంగాణ మహోన్నత సంకల్పాన్ని గాంధేయ మార్గంలో రాజకీయ ప్రక్రియగా మలిచి దాన్ని లక్షలాది ప్రజల సింహగర్జనగా, జనఘోషగా కేసీఆర్ మార్చగలిగారు. ఇదే టీఆర్ఎస్ బలానికి నిదర్శనంగా నిలిచింది. కేసీఆర్ అన్నికోణాల నుంచి ఉద్యమాన్ని రగిలించి ఆమరణ నిరాహారదీక్షకు దిగారు. 2009 నవంబర్ 29 నుంచి డిసెంబర్ 9 వరకు 11 రోజులు కేసీఆర్ చేసిన ఆమరణ దీక్ష మొత్తం తెలంగాణ సమాజాన్ని కదిలించింది. 29న సిద్దిపేటలో ఆమరణ దీక్షను అడ్డుకుని అరెస్టు చేయటంతో తెలంగాణ అట్టుడికిపోయింది. కేంద్రం కదిలిపోయింది. కేసీఆర్ తన మాటల్ని తూటాలుగా మార్చాడు.

ప్రజా ఉద్యమాన్ని రాజకీయ ఉద్యమ ప్రక్రియగా మలిచాడు. అమరుల త్యాగాలతో తెలంగాణ తల్లడిల్లుతుంటే కేసీఆర్ తన ఆమరణ నిరాహారదీక్షతో కేంద్రం కళ్ళు తెరిపించాడు. 2009 డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్ర ప్రక్రియ ప్రారంభం అన్న ప్రకటన తెప్పించగలిగిన ధీశాలి, శక్తిమంతుడు కేసీఆర్. తెలంగాణ ప్రజలంతా ఏదైతే కోరుతున్నారో దానికి టీఆర్ఎస్‌ను నాలుకగా మలిచిన మలిదశ తెలంగాణ ఉద్యమకారుడిగా కేసీఆర్ చరిత్రలో మిగిలిపోతారు. తెలంగాణ చరిత్ర సామాజిక, భౌగోళిక, ఆర్థిక రాజకీయ పరిస్థితుల పట్ల ఆయనకు ఉన్న పరిజ్ఞానం అపారం. గొప్ప బుద్ధికుశలత, ఆలోచనలు, సైద్ధాంతిక అవగాహనతో పాటు ఆధునిక రాజకీయాలలో ఆయన అవగాహన లోతైనది. తెలంగాణపై గంటలు గంటలు మాట్లాడగల వాగ్ధాటి ఆయనకు పెట్టని ఆభరణం. ఉద్యమం కోసం ప్రాణాన్ని పణంగా పెట్టి ప్రత్యేక రాష్ట్రం రావాలన్న సత్యాగ్రహి కేసీఆర్. తెలంగాణ రాష్ట్ర సాధన అన్న నిబద్ధత నిమగ్నతలతో నిండిన మహోద్యమ స్వరూపం కేసీఆర్. చరిత్రలో కేసీఆర్ లాంటి నాయకులు అరుదుగా కన్పిస్తారు.

# అనుసంధానానికున్న అడ్డంకులు సీఎంకు వివరించారా?

చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో జల వనరుల శాఖలో కదలిక వచ్చింది. పైగా మొన్నటి బడ్జెట్‌లో మెట్ట ప్రాంతాల్లోని పెండింగ్ ప్రాజెక్టులకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి లోబడి బాగానే నిధులు కేటాయించారు. వాస్తవం చెప్పాలంటే కొన్ని ప్రాజెక్టులకు కేటాయించిన నిధులు ఈ ఆర్థిక సంవత్సరంలో వ్యయం చేయడం కుదరదు. ఉదాహరణకు%-% గాలేరు నగరి సుజల స్రవంతికి రూ.2438.84కోట్లు కేటాయించారు. కాని ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ నాలుగైదు నెలల్లో ఈ నిధులు వ్యయం చేయలేరు. ఇదే సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరిగి గోదావరి - కృష్ణ - పెన్నా నదుల అనుసంధానాన్ని తెరపైకి తెచ్చి దానిపై దృష్టి సారిస్తున్నారు. ఒక విధంగా ఈ అనుసంధానం రాష్ట్రానికి అవసరం కూడా. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఈ అనుసంధానానికి పలు అడ్డంకులు తప్పవేమో. ఆ మాట కొస్తే ఈ అనుసంధానానికే కాదు, రాయలసీమలో కొన్ని పథకాలకు, ఉత్తరాంధ్రలో వంశధార %-% నాగావళి నదుల అనుసంధానికి అంతర్ రాష్ట్ర జల వివాదం అడ్డంగా ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్యంగా అంతర్ రాష్ట్ర జల వివాదాల పరిష్కారంపై దృష్టి పెట్టాలి. ఇవన్నీ అటుంచి కేంద్ర ప్రభుత్వం గోదావరి %-% కావేరి అనుసంధానం గురించి పట్టువదలని విక్రమార్కుడులా కొన్నేళ్లుగా వ్యవహరిస్తోంది. ఈ మధ్య రాష్ట్ర జల వనరుల శాఖపై సమీక్షా సమావేశాలు జరిగినప్పుడు అంతర్ రాష్ట్ర జల వివాదాల విషయం గాని, గోదావరి- కావేరి నదుల అనుసంధానం గాని ప్రస్తావనకు రాలేదు. రాష్ట్ర జలవనరుల శాఖ ఉన్నతాధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకొచ్చారో లేదో తెలియదు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న గోదావరి- కావేరి అనుసంధానం అంశంలో రాష్ట్ర ప్రభుత్వం వైఖరి ముందుగా తేలితేనే ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్టుబడుతున్న గోదావరి - కృష్ణ - పెన్నా అనుసంధానంపై ముందుకు వెళ్లేందుకు వీలు కలుగుతుంది. పైగా ముఖ్యమంత్రి ఢిల్లీలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల సీతారామ్‌ను కలసి రాష్ట్రం ప్రతిపాదిస్తున్న అనుసంధానానికి ఆర్థిక సాయం అభ్యర్థించారంటే గోదావరి -కావేరి అనుసంధానం అంశంపై ఏ వైఖరి తీసుకొంటారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా ఉంది. తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో పాగా వేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ గోదావరి -కావేరి అనుసంధానాన్ని ఒక ఆయుధంగా ఉపయోగించుకోవాలని విశ్వప్రయత్నం చేస్తున్నారు. కేసీఆర్ అడ్డు పడకుండా ఉంటే ఎప్పుడో జరిగిపోయేది. ఇప్పుడు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం సవాలక్ష షరతులు పెడుతోంది. పైగా ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ ప్రభుత్వం ఉన్నా తన వాటా నీళ్లు ఇచ్చేందుకు అడ్డు చెబుతోంది. మున్ముందు ఏం జరుగుతుందన్నది పక్కన పెడితే గోదావరిలో రెండు తెలుగు రాష్ట్రాల వాటాలు ఇంకా తేలలేదు. తెలంగాణ అడ్డగోలుగా వాదిస్తోంది. గోదావరి ట్రిబ్యునల్ కేటాయించిన 1480 టీఎంసీల్లో తమ వాటా 967.94 టీఎంసీలనీ, ఆంధ్రప్రదేశ్ వాటా కేవలం 530 టీఎంసీలనీ తెలంగాణ వాదన. ఇటీవల జరిగిన గోదావరి యాజమాన్య బోర్డు సమావేశంలో సీతమ్మ సాగర్ డీపీఆర్‌ను తెలంగాణ సమర్పించినపుడు ఆంధ్రప్రదేశ్ ఇంజనీర్లు నికర జలాలు లేవని అభ్యంతరం చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ ఇంజనీరింగ్ అధికారులు ఆంధ్రప్రదేశ్ వాటా 530 టీఎంసీలేనని తెగేసి చెప్పారు. అయిదేళ్లు అధికారంలో ఉన్న జగన్మోహన్‌రెడ్డి కేసీఆర్ ఏం చెబితే దానికి తలూపడంతో సరిపెట్టారు. ఫలితంగా కృష్ణా నదీ జలాలు తిరిగి పంపిణీకి ట్రిబ్యునల్ ఏర్పడి తెలంగాణ రొట్టె విరిగి నేతిలో పడింది. అదే సమయంలో కనీసం గోదావరి జలాల వాటా విషయం గట్టిగా పట్టించుకోకపోవడంతో ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ఇబ్బందిపడవలసి వస్తోంది. కేసీఆర్ తన హయాంలో గోదావరిపై పలు ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. ఇప్పుడు అవన్నీ చకచకా నిర్మాణం సాగితే, ఆంధ్రప్రదేశ్ వచ్చేసరికి ఒక్క పోలవరం తప్ప మరే పథకమూ నిర్మాణంలో లేదు. అదే జరిగితే కేవలం వరద జలాలపై ఆధారపడి గోదావరి %-% పెన్నా అనుసంధానం చేపట్టాల్సి ఉంటుంది. కాగా మొన్న జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి మరో ప్రతిపాదన చేసినట్లు వార్తలు వచ్చాయి. కృష్ణా నదికి వరద వచ్చే సమయంలో ఆ నీటిని ముందుగా తరలించే విధంగా ప్రణాళిక వుండాలని, కృష్ణలో వరద లేని రోజుల్లో గోదావరి జలాలు తరలించే విధంగా రూపకల్పన చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. కృష్ణలో వరద ఉన్న రోజుల్లో వినియోగించే జలాలు కూడా ఆంధ్రప్రదేశ్ వాటాలో వేయాలని తెలంగాణ వాదిస్తోంది. ప్రకాశం బ్యారేజీ నుంచి విడుదలై సముద్రంలో కలిసే సమయంలో వాడుకొనే నీళ్లు తమ వాటాలో వద్దని ఆంధ్రప్రదేశ్ కోరుతున్నా తెలంగాణ పట్టించుకోవడం లేదు. కృష్ణా యాజమాన్య బోర్డు కేవలం మేక చన్నుగా మిగిలిపోయింది. కృష్ణా వరద జలాలకే కాకుండా గోదావరి వరద జలాలకూ తెలంగాణ మోకాలడ్డుతున్న అంశం రాష్ట్ర ఇంజనీరింగ్ అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారా? జగన్మోహన్‌రెడ్డి తన హయాంలో కేసీఆర్ నిర్దేశంలో అంతర్ రాష్ట్ర జల వివాదాలు నడిపేవారు. జగన్మోహన్‌రెడ్డికి ఎవరూ చెప్పేందుకు సాహసించేవారు కాదు. ప్రస్తుతం చంద్రబాబు నాయుడు అలా కాదు కదా? మున్ముందు ఎదురు కానున్న ఇబ్బందులను ముఖ్యమంత్రి దృష్టికి ఇంజనీరింగ్ అధికారులు తేవలసి ఉంది. కృష్ణ ఆయకట్టుకు రెండు వైపుల నుంచీ నీటి సరఫరా వుంటే వాళ్ల దృష్టిలో గోదావరి జలాలు అవి ఏ నీరైనా కృష్ణ ఆయకట్టుకు వస్తే కృష్ణలో మిగులు నీళ్లు తమకు కేటాయించాలనే డిమాండ్‌తోనే ట్రిబ్యునల్ ఏర్పాటు సాధించారు. ప్రధానంగా ఈ డిమాండ్‌తోనే ట్రిబ్యునల్‌లో తెలంగాణ వాదిస్తోంది. ట్రిబ్యునల్ తీర్పు వచ్చే లోపు ఈ అనుసంధానం ఎంత వరకు న్యాయపరంగా నిలుస్తుందో, ఒకవేళ అమలుకు పూనుకొంటే ట్రిబ్యునల్ తీర్పుపై ఎలాంటి ప్రభావం ఉంటుందో ముఖ్యమంత్రికి ఇంజనీరింగ్ అధికారులు తప్పకుండా వివరించాలి. పైగా ఇంతటి భారీ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే నిర్మించడం అసాధ్యం. ఇతర ఏ సంస్థ నుంచైనా అప్పు తేవాలంటే కేంద్ర జల సంఘం ఆమోదం తప్పనిసరి. కేంద్ర జలసంఘమే కాదు, అప్పు ఇచ్చే సంస్థలు కూడా నికర



జలాలు లేనిదే పైసా ఇవ్వవు. విదేశీ సంస్థలే కాకుండా కేంద్ర ప్రభుత్వ ఉపాంగాలైన సంస్థలు కూడా ఈ నిబంధన పాటిస్తాయి. ఒకవేళ గోదావరి కావేరి అనుసంధానంలో భాగంగా ఈ పథకం చేపట్టాలంటే పోలవరం నుంచి సాధ్యం కాదని ఈ పాటికే తేలిపోయింది. ఎందుకంటే పోలవరం వద్ద నికర జలాలు లేవు. ఈ పాటికే నదుల అనుసంధానం టాస్క్‌ఫోర్స్ కమిటీ చైర్మన్ వెదిరె శ్రీరాం వీలు కాదని తేల్చి చెప్పారు. జగన్మోహన్‌రెడ్డి హయాంలో తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఒకవేళ సమ్మక్క బ్యారేజీ నుండి గోదావరి కావేరి అనుసంధానం మొదలుపెడితే గోదావరి పెన్నా అనుసంధానం ఎంత వరకు సాధ్యం? గోదావరి కావేరి అనుసంధానం చేపడితే ఆంధ్రప్రదేశ్‌కు దక్కేది కేవలం 80టీఎంసీలు మాత్రమే. జగన్మోహన్‌రెడ్డి దాష్టీకం లేకుండా తెలంగాణతో ఇచ్చిపుచ్చుకొనే ధోరణిలో అంతర్ రాష్ట్ర జల వివాదం ఒక కొలిక్కి వచ్చి ఉంటే ప్రస్తుతం చంద్రబాబు నాయుడు ప్రతిపాదిస్తున్న గోదావరి పెన్నా అనుసంధానంతో రాయలసీమతో పాటు ఉమ్మడి నెల్లూరు ప్రకాశం జిల్లాల పొలాలకు వరద ఉన్న రోజుల్లో కృష్ణ జలాలు మిగిలిన కాలంలో గోదావరి జలాలతో పునీతమయ్యేటివి.

## నేషనల్ అకాడమీ కన్ స్ట్రక్షన్ ఆఫ్ గవర్నమెంట్ తెలంగాణ సినిమా టెక్నాలజీ సాఫ్ట్ వేర్ కోర్స్ కు సంబందించి నోటిఫికేష్ విడదల

ఆదిలాబాద్, తెలంగాణ సేన న్యూస్ : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని యువతీ యువకులు తెలంగాణ ప్రభుత్వం నేషనల్ అకాడమీ కన్ స్ట్రక్షన్ ఆఫ్ గవర్నమెంట్ తెలంగాణ సినిమా టెక్నాలజీ సాఫ్ట్ వేర్ కోర్స్ కు సంబందించి నోటిఫికేష్ విడదల చేసిందని అసిస్టంట్ డైరెక్టర్ నాగేందం తెలిపారు. దీనిలో భాగంగా సినిమాటోగ్రఫీ మాస్టారి, డిజిటల్ డిజైన్ సోషల్ మీడియా మేనేజ్మెంట్, ప్రొడక్షన్ మేనేజ్మెంట్, యాంకరింగ్ ఈ ఎం సీ ఈ ఈ డబ్బింగ్ వాయిస్ ఓవర్ స్కిల్స్, మ్యూజిక్ ప్రొడక్షన్ మాస్ ట్రీ ప్రొఫెషనల్ ప్రొడక్షన్ మాస్టారి, ప్రొఫెషనల్ గానం శిక్షణ, అన్నిటి డిజైనింగ్ నైపుణ్యం మొదలగు కోర్సులకు నోటిఫికేషన్ ఇచ్చింది. 3 నెలల కోర్సు కు సంబందించి మూడు విడతలుగా 35000 రూపాయలు గా ఫీజు నిర్ణయించింది. శిక్షణ అనంతరం ఉపాధి చూపిస్తు మూవీ ఆర్టిస్ట్ అసోసి యేషన్ లో సభ్యత్వం కల్పించబడుతుంది. ఆసక్తిగలవారు డిసెంబర్ 2 వ తేదీలోగా న్యాక్ కా ర్యాలయం అదిలాబాద్ ఇంచార్జీ యం మహేష్ కుమార్ 9154548063 ని సంప్రదించగలరని ఆయన తెలిపారు.

## ఇందిరమ్మ డబుల్ బెడ్‌రూమ్ ఇక ట్రిపుల్ బెడ్‌రూమ్

ఇందిరమ్మ రాజ్యంలో నిరుపేదలను అన్ని విధాల ఆదుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. నిరుపేదలను అర్హులైన వారిని గుర్తించి వారికి డబుల్ బెడ్ రూమ్ ఇచ్చేందుకు నియోజకవర్గానికి 3500 ఇళ్ళ చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే ఈ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మీరు కావాలనుకుంటే ట్రిపుల్ బెడ్ రూమ్ కూడా అవుతుంది. ఎలానో ఇప్పుడు తెలుసుకుందాం. రెండు దశల్లో పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలని ప్రభుత్వం ఆశిస్తోంది మొదటి దశలో సొంత స్థలం ఉన్న నిరుపేదలను గుర్తించి అందులో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించుకునేందుకు ఐదు లక్షల వరకు ఆర్థిక సహాయం చేస్తుంది. రెండో దశలో సొంత ఇంటి స్థలం లేని నిరుపేదలను గుర్తించి ప్రభుత్వమే వారికి స్థలంతో పాటు డబుల్ బెడ్ రూమ్‌ని నిర్మించి ఇస్తుంది. అయితే డబుల్ బెడ్ రూమ్ ఇల్లు పూర్తిగా అర్హులైన నిరుపేదలకు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుంది. పార్టీలకు అతీతంగా అర్హులైన అందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వటమే ప్రభుత్వ లక్ష్యంగా ముందుకెళ్తుంది. అందుకోసమే ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేసింది ప్రభుత్వం.. ఇందిరమ్మ కమిటీలు గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేస్తుం.ది అర్హులని ఎంపిక చేసేందుకు కొత్త సాంకేతికతను కూడా ప్రభుత్వం వినియోగిస్తుంది. ఇందుకు గాను ఒక ప్రత్యేకమైన రెవెన్యూ శాఖ యాప్‌ను రూపొందించింది. ప్రభుత్వం నిర్మించే ఇల్లు అంటే ఏదో నామ్ కి వస్తే ఎలా కాకుండా నిజంగా తన సొంత ఖర్చుతో ఒక పేదవాడు నిర్మించుకుంటే ఇల్లు ఎలా ఉంటుందో అలా ఉండాలని ప్రభుత్వం భావిస్తుంది. అందుకే ఎవరికైనా ఆర్థిక స్తోమత సహకరించి పెద్ద కుటుంబం ఉండి డబల్ బెడ్ రూమ్ తమకు సరిపోదు అనుకుంటే తన సొంత ఖర్చుతో ఇంకో గదిని నిర్మించుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పిస్తోంది. ఈ విషయంపై శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సీఎంతో సమావేశం నిర్వహించారు. పెద్ద కుటుంబం ఉండి ఆర్థిక స్తోమత ఉంటే డబల్ బెడ్ రూమ్‌ని ట్రిపుల్ బెడ్ రూమ్‌గా నిర్మించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అయితే అదనపు గదికి అయ్యే ఖర్చును లబ్ధిదారుడే సొంతంగా భరించాల్సి ఉంటుంది. అయితే నియోజకవర్గానికి 3500 చొప్పున ఇళ్లను కేటాయించిన అవసరాన్ని బట్టి ఆ సంఖ్యను పెంచడానికి కూడా సుముఖంగా ఉన్నట్టు తెలిపింది. ఆదివాసీ ప్రాంతాలు, ఐటీడీఏల పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ప్రత్యేక కోటా ఇచ్చేందుకు చర్యలు తీసుకోనున్నట్లు సీఎం రేవంత్ ఇటీవలే ప్రకటించారు.

## ఖేలో ఇండియా గేమ్స్‌కు వేదికగా హైదరాబాద్..

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు ఖేలో ఇండియా %–% 2026 పోటీలను హైదరాబాద్‌లో నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. వచ్చే ఏడాది నిర్వహించేలా ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేసినా 2025లో బిహార్‌లో నిర్వహించేలా ఇప్పటికే నిర్ణయం జరగడంతో 2026లో హైదరాబాద్‌లో నిర్వహించేందుకు కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ సింగ్ మాండవీయ సానుకూలంగా స్పందించి సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డికి హామీ ఇచ్చారు. రాతపూర్వక విజ్ఞప్తిని జితేందర్‌రెడ్డి గురువారం (నవంబరు 28) కేంద్ర మంత్రికి అందజేసి వివరించడంతో ఓ స్పష్టత లభించింది. హైదరాబాద్ నగరంలో 32వ జాతీయ క్రీడలు (2002లో), ఆఫ్రో ఆషియన్ గేమ్స్, 7వ మిలిటరీ గేమ్స్ సహా అనేక జాతీయ స్థాయి పోటీలు జరిగాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ లేఖలో ప్రస్తావించారు. క్రీడా రంగానికి గత పదేండ్ల పాలనతో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నదని, జాతీయ స్థాయి పోటీలను నిర్వహించడానికి అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని ఆ లేఖలో సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు.గచ్చిబౌలిలోని స్పోర్ట్స్ కాంప్లెక్సుల అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్, సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, హాకీ టర్ఫ్, షూటింగ్ రేంజ్, సరూర్‌నగర్‌లో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం (ఎయిర్ కండిషన్డ్), సింథటిక్ టెన్నిస్ కోర్ట్, స్కేటింగ్ ట్రాక్, ఔట్ డోర్ స్టేడియం, ఎల్బీ స్టేడియంలో ఇండోర్ స్టేడియంతో పాటు టెన్నిస్ కాంప్లెక్స్, ఫుట్ బాల్ గ్రౌండ్, కేవీబీఆర్ ఇండోర్ స్టేడియం, హుస్సేన్ సాగర్‌లో వాటర్ స్పోర్ట్స్ నిర్వహించే సౌకర్యం, ఉస్మానియా క్యాంపస్‌లో సైక్లింగ్ వెల్‌డ్రోమ్, సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ ట్రాక్, జింఖానా-2 గ్రౌండ్‌లో ఫుట్ బాల్ గ్రౌండ్‌తో పాటు ఔట్ డోర్ గేమ్స్ నిర్వహించే వసతులు ఉన్నాయని ఆ లేఖలో సీఎం రేవంత్ గుర్తుచేశారు.

# స్వరాష్ట్ర స్వప్నం కోసమే దీక్ష దివాస్

**– కొత్తగూడ బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొమ్మనబోయిన వేణు యాదవ్**



ములుగు /కొత్తగూడ, తెలంగాణ సేన న్యూస్: తెలంగాణ స్వరాష్ట్ర స్వప్నం కోసమే దీక్ష దివాస్ అని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొమ్మనబోయిన వేణు యాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం లో దీక్ష దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాలను తెగించి కెసిఆర్ తెలంగాణ స్వరాష్ట్రము సిద్దించాలని దీక్ష చేపట్టారని అన్నారు. కెసిఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో అనే నినాదం తో తెలంగాణ ప్రజలకు, విద్యార్థులకు, మేధావులకు స్వరాష్ట్రము కోసం ఉద్యమం లో ఆదర్శం అయ్యాడని అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఢిల్లీ లో మహా యుద్ధమే చేసాడని గుర్తు చేశారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా తెలంగాణ ను సాధించిన ఘనత కెసిఆర్ ది అని అన్నారు. ఈ కార్యక్రమం లో మండల అధికార ప్రతినిధి బానోత్ నెహ్రూ నాయక్, గంగారం మండల అధ్యక్షులు ఈర్ప సూరయ్య. మాజీ ఎంపీటీసీ నానుబోతుల స్వప్న లింగన్న, మోకాళ్ళ సంతోషరాణి వెంకటేష్,మాజీ సర్పంచ్ బానోత్ కిషన్, బానోత్ వీరన్న,గోగ్గల లక్ష్మయ్య,పార్టీ సినియర్ నాయకులు బొల్లు రవి, చెన్నూరి వెంకన్న, బాలకొమురయ్య, వెంకటనారాయణ చారీ, కోమనబోయిన మలయ్య, ఆవుల రమేష్,పడాల నాగేశ్వరావు, ఈర్ప సాంబయ్య,చెన్నూరు దేవేందర్, తాళ్ల రవి, జనగం, రవి రెడ్యానాయక్ తదితరులు పాలుగోన్నారు.

# రైతు ప్రజా పాలన విజయోత్సవ సభలో పాల్గొన్న తెలంగాణ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క



మహబూబాబాద్ /కొత్తగూడ, తెలంగాణ సేన న్యూస్ :మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రైతు ప్రజాపాలన విజయోత్సవ వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వజ్జ సారయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి సీతక్క మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఇచ్చిన వాగ్దానాల మేరకు రైతులకు మహిళలకు మొదటి ప్రాధాన్యత కల్పించామని తెలిపారు.ఏకకాలంలో రెండు లక్షల రైతు రుణమాఫీ, సన్న వడ్లకు 500 బోనస్, మరికొన్ని రోజుల్లో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇల్లు, మహిళా సంక్షేమ పథకాలు, వడ్డీ లేని రుణాలు, పాకాల నుండి కొత్తగూడ గంగారం ఉమ్మడి మండలాలకు రెండు పంటలు పండుటకు సాగునీరు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైంది, గత కొన్ని ఏళ్లుగా సాగు చేసుకుంటున్నా పోడు భూములకు కూడా హక్కుపత్రాలు కల్పించి ప్రభుత్వపరంగా రైతు భరోసా రైతుబంధు బ్యాంకులలో రుణాలు అతి త్వరలో అందిస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు.మండలంలోని ప్రతి గ్రామ గ్రామాన నూటికి నూరు శాతం సిసి రోడ్లు, కల్వర్టులు,చెక్ డ్యాములు, వ్యవసాయ భూములు సాగు చేసుకుంటున్న ప్రాంతాలకు నూతన చెరువులు మంజూరు, శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ భవనాలకు నూతన భవనాలు మంజూరు, గ్రామపంచాయతీ భవనాలకు పబ్లిక్ టాయిలెట్స్, మంచినీటి సౌకర్యం కలదు, ఉమ్మడి మండల కేంద్రంలో 50 లక్షల రూపాయలతో ఫంక్షన్ హాల్ నూతన భవనం కలదు సంబంధిత కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వహిస్తే తగదు అన్నారు. వెంటనే కాంట్రాక్టర్లు వారు తీసుకున్న రహదారుల పనులను పూర్తి చేయాలని నాణ్యత కూడిన పనులు చేయాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, బ్లాక్ నాయకులు, జిల్లా నాయకులు మండల నాయకులు,కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ అన్ని కమిటీల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## దీక్షా దివస్ కు భారీగా తరలిన బీ.ఆర్.ఎస్ శ్రేణులు

**– బైక్ ర్యాలీ తో కిక్కిరిసిన సికింద్రాబాద్ రహదారులు**



సికింద్రాబాద్, తెలంగాణ సేన న్యూస్ : బీ.ఆర్.ఎస్. పార్టీ నాయకత్వం చేపట్టిన దీక్షా దేవాస్ ను పురస్కరించుకొని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ పిలుపు మేరకు సికింద్రాబాద్ లో బీ.ఆర్.ఎస్. శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించాయి. చిలకలగుడా మున్సిపల్ గ్రౌండ్ నుంచి వివిధ ప్రాంతాల మీదుగా బంజారా హిల్స్ బసవ తారకం ఆసుపత్రి, తెలంగాణా భవన్ కు ర్యాలీ నిర్వహించారు. చిలకలగుడా గ్రౌండ్ వద్ద బైక్ ర్యాలీని బీ.ఆర్.ఎస్. యువ నేత తీగుల్ల కిషోర్ కుమార్ గౌడ్, నియోజకవర్గానికి చెందిన కార్పొరేటర్లు కుమారి సామల హేమ, కంది శైలజ,లింగాని ప్రసన్న లక్ష్మి శ్రీనివాస్, రాసురి సునీత రమేష్, యువజన విభాగం అధ్యక్షుడు ఆలకుంట్ హరి, నాయకులు కంది నారాయణ, కరాటే రాజు, లింగాని శ్రీనివాస్, సునీల్, రాజ సుందర్ తదితరులతో కలిసి ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో మహిళా నేతలు, యువ నాయకులు కూడా పాల్గొన్న ఈ ర్యాలీ లో అడ్డగుట్ట, మెట్టుగూడ, సితఫలమాండీ, తార్నాక, బౌద్దనగర్ మున్సిపల్ డివిజనల కు సంబంధించి వందలాది మంది కార్యకర్తలు, నాయకులు బైక్ ల పై పాల్గొన్నారు. గులాబీ జండాలు రెపరెప లడుతోండగా, ఖండువాలు వేసుకున్న కార్యకర్తలు కే సీ ఆర్, పద్మారావు గౌడ్, తెలంగాణా నినాదాలతో హోరేత్తిస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. వేలాది వాహనాలు ర్యాలీలో తరలిరావడంతో సికింద్రాబాద్ లోని అన్ని రహదారులు గులాబీ మయంగా మరి పోయాయి. బసవతారకం ఆసుపత్రి కూడలి వద్ద ఈ ర్యాలీ కి శాసనసభ్యులు తీగుల్ల పద్మారావు గౌడ్ ఇతర నేతలతో కలిసి స్వాగతం పలికారు.

# నిరుపేదలకు తొలి ప్రాధాన్యత

**– సీఎం రేవంత్ రెడ్డి**



హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్ : ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అత్యంత నిరుపేదలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ముఖ్యంగా దివ్యాంగులు, వ్యవసాయ కూలీలు, సాగుభూమి లేని వారు, పారిశుద్ధ్య కార్మికులు ఇలా ప్రాధాన్యత క్రమాన్ని ఎంచుకోవాలని ఆయన చెప్పారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి , సలహాదారు వేం నరేందర్ రెడ్డి తో కలిసి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు విధివిధానాలు, లబ్ధిదారుల ఎంపిక తదితర అంశాలపై సీఎం ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించి పలు సూచనలు చేశారు. తొలి దశలో సొంత స్థలాలున్న వారికే ప్రాధాన్యత ఇస్తున్న కారణంగా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ విషయంలో గ్రామ కార్యదర్శితో పాటు మండల స్థాయి అధికారులను బాధ్యులను చేయాలి.అందుకోసం అవసరమైన సాంకేతికతను వినియోగించుకోవాలి. ముఖ్యంగా ఇందిరమ్మ యాప్‌లో ఎలాంటి లోపాలు, లోటుపాట్లు లేకుండా చూడాలని సీఎం వెల్లడించారు. ఆదివాసీ ప్రాంతాలు, ఐటీడీఏల పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ప్రత్యేక కోటా ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని,లబ్దిదారులు ఎవరైనా ఇందిరమ్మ ఇళ్లకు అదనంగా గదులు నిర్మించుకోవాలని ఆసక్తి చూపితే అందుకు అవకాశం కల్పించాలన్నారు. ఈ పథకం సమర్ధవంతంగా కొనసాగించడానికి గృహ నిర్మాణ శాఖలో అవసరమైన అధికారులు, సిబ్బందిని నియమించుకోవాలని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఎవర్రా మీరు..ఇంత టాలెంటెడ్‌గా ఉన్నారు!



ఏకంగా మద్యం షాపుకే కన్నం వేశారు దుండగులు.. మద్యాన్ని కొనుక్కోవాలని ఉన్నా , వారి దగ్గర డబ్బులు లేకనో, మరేదో కారణమో తెలియదు కానీ ఏకంగా మద్యం షాపుకే కన్నం వేసి లోపల ఉన్న మద్యాన్ని దోచుకెళ్లారు. హైదరాబాద్ నగర శివార్లో ఈ ఘటన చోటుచేసుకుంది. శంషాబాద్ మండలంలోని పాలమాకుల గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహ వైన్స్ షాప్ ఉంది. శుక్రవారం ఉదయం తెల్లవారుజామున 3:45 నిమిషాలకు ఈ ఘటన చోటుచేసుకుంది శ్రీ లక్ష్మీనరసింహ వైన్స్ షాప్‌కు ఒక పెద్ద రంధ్రం వేసి షాప్ లోపలికి ప్రవేశించారు దుండగులు.. షాప్ లోపలికి వెళ్లినవారు ముసుగు ధరించి ఎక్కడ తమ ఆనవాళ్లు సీసీ కెమెరాలో పడకుండా జాగ్రత్త పడ్డారు. ఒక పెద్ద రంధ్రం వేసి షాప్ లోపలికి వెనకాల నుండి ప్రవేశించారు. లోపలికి వెళ్లన వ్యక్తి ముసుగు ధరించి ఉండటంతో ఎక్కడ కూడా సీసీ కెమెరాల్లో నిందితుడి మొహం కనిపించట్లేదు. షాపులోకి వెళ్లిన నిందితుడు కాళ్లకు చెప్పులు లేకుండా పైనుండి కింది వరకు కేవలం సిమెంట్ కలర్ స్వెటర్, ప్యాంటును ధరించాడు. షాపు లోపలికి ప్రవేశించాక నేరుగా క్యాషియర్ దగ్గరికి వెళ్ళాడు. ఆ క్యాషియర్ తెరిచి చూసినా అందులో ఉన్న డబ్బులను మాత్రం ముట్టలేదు. ఆ వెంటనే అట్ట పెట్టెలను తెరిచి చూశాడు. అందులో ఉన్న భారీ మద్యం స్టాక్‌ను అతడు ముట్టుకోలేదు.

## బౌలర్లు మంచి కెప్టెన్లు కాలేరా?

సీమకిరణం ప్రతినిధి జస్ప్రీత్ బుమ్రా నాయకత్వంలో టీమ్ ఇండియా పెర్త్ నగరంలో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై ఘన విజయం సాధించింది. బౌలర్‌గా, కెప్టెన్‌గా బుమ్రా అపూర్వ ప్రతిభా పాటవాలు ప్రదర్శించారు. చాలా సంవత్సరాల క్రితం అనిల్ కుంబ్లేకు టీమ్ ఇండియా కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించాలని సూచిస్తూ నేను ఒక వ్యాసాన్ని రాశాను. 'ది హిందూ'లో 26 జూలై 1998న 'డు బౌలర్స్ మేక్ గుడ్ కెప్టెన్స్?' అనే శీర్షికతో అది ప్రచురితమయింది. పెర్త్‌లో బుమ్రా బౌలింగ్ నైపుణ్యం, కెప్టెన్సీ సామర్థ్యం చూసిన తరువాత నాకు ఆ వ్యాసం గుర్తుకు వచ్చింది. ఒక క్రీడాకారుడి %–%అతడెంత ఆరితేరిన ఆటగాడు అయినప్పటికీ%–% పక్షాన అలా వాదించడమనేది నా స్వభావానికి విరుద్ధం. అయితే బ్యాటర్లు మాత్రమే ఉత్తమోత్తమ కెప్టెన్లు కాగలరని క్రికెట్ జగత్తులో విస్తృతంగా ఉన్న ఒక విశ్వాసాన్ని త్రోసిపుచ్చేందుకే నేను ఆ వ్యాసాన్ని రాశాను. కెప్టెన్ సొంత జట్టు ఫీల్డ్‌లో ఉన్నప్పుడు కెప్టెన్సీకి మరింత ప్రాధాన్యముంటుంది. బౌలర్లు, ఫీల్డర్లను మార్చడంలో బ్యాటర్లు దృష్టిని కేంద్రీకరించి నిష్పాక్షిక నిర్ణయాలు తీసుకోగలరనే అభిప్రాయం సర్వత్రా ఉంది. బౌలర్లు తమ టీమ్‌కు నేతృత్వం వహిస్తున్నప్పుడు వారు అండర్ బౌలింగ్ లేదా ఓవర్ బౌలింగ్ (సాధారణంగా ఓవర్ బౌలింగ్) చేస్తారని భావించడం కద్దు. బ్యాటర్%–%కెప్టెన్ల అనుకూల వాదనలకు చారిత్రక ఆధారాలు సైతం దృఢంగా ఉన్నాయి. టెస్ట్ క్రికెట్ చరిత్రలో అసాధారణ విజయాలు సాధించిన ప్రశస్త కెప్టెన్లు అందరూ బ్యాటర్లే అన్న వాస్తవాన్ని 1998 నాటి నా వ్యాసంలో నేను అంగీకరించాను. డొనాల్డ్ బ్రాడ్‌మన్, క్లైవ్ లాయడ్ లే కాకుండా లెన్ హట్టన్, ఫ్రాంక్ వర్రెల్, అలెన్ బోర్డర్ (ఆసీస్ స్కిప్పర్‌గా స్టీవ్ వా అనితర సాధ్యంగా ఆడి తన జట్టుకు ఘన విజయాల చరిత్రను సృష్టించక ముందు)లు ఉత్కృష్ట టీమ్ లీడర్స్‌గా జగద్విఖ్యాతులయ్యారు. అయితే బౌలర్లు సైతం టీమ్ లీడర్స్‌గా ఘన చరిత్ర సృష్టించారని నేను వాదించాను. ఆస్ట్రేలియాకు చెందిన రిచియె బెనౌడ్, ఇంగ్లాండ్‌కు చెందిన రే ఇల్లింగ్ వర్త్‌లు తమ తమ టీమ్‌లను చరిత్రాత్మక గెలుపు బాటలలో నడిపించడమే అందుకు ఉదాహరణలు. రే, నేను ఆ వ్యాసాన్ని రాసిన కాలంలో టీమ్ ఇండియా కెప్టెన్‌గా అజరుద్దీన్ తన క్రికెట్ జీవితం చివరి దశలో ఉన్నారు. అజరుద్దీన్ నిష్క్రమించిన అనంతరం అనిల్ కుంబ్లే ఆయనకు యోగ్యమైన వారసుడు అవుతారని నేను ఆ వ్యాసంలో వాదించాను. కేవలం క్రికెటింగ్ ప్రతిభ ఉన్నవాడే కాకుండా నిశిత మేధ ఉన్న ఆటగాడు అనిల్ కుంబ్లే అని నేను అభిప్రాయపడ్డాను. రంజీ ట్రోఫీలో కర్ణాటక టీమ్ ప్రశస్త విజయానికి కుంబ్లే కెప్టెన్సీ విశేషంగా దోహదం చేసిందని నేను పేర్కొన్నాను. వికెట్లను పడగొట్టడంలో బెనౌడ్‌కు అలన్ డేవిడ్‌సన్ మరో బౌలర్ సహకారం ఉండేది. ఇల్లింగ్‌వర్త్‌కు జాన్ స్నో, డెరెక్ అండర్ వుడ్ లాంటి బౌలర్లు తోడ్పడేవారు. అనిల్ కుంబ్లే అలాగే జవగల్ శ్రీనాథ్‌పై ఆధారపడవచ్చు. భారత్‌కు ప్రపంచ కప్‌ను సాధించిన టీమ్ ఇండియాకు సారథ్యం వహించింది బౌలర్ కపిల్‌దేవ్ అన్న వాస్తవం అవిస్మరణీయమైనది కాదూ? పావు శతాబ్దికి పూర్వం ప్రచురితమైన ఆ వ్యాసంలో నేను ఇంకా ఇలా పేర్కొన్నాను: 'బౌలర్లు మంచి కెప్టెన్లు కాలేరన్న అపోహకు కారణమేమిటి? క్రికెట్ క్రీడలో బౌలర్ల హోదాలో క్రింది స్థాయికి చెందినదనే భావనలో భాగమే ఆ అపోహ. క్రికెట్ క్రీడాకారులలో ప్రజాదరణ అధికంగా పొందుతున్నది బ్యాటర్లే. క్రికెట్ అభిమానులకు, క్రికెట్ టోర్నమెంట్స్ వ్యవహారాలకు బాధ్యత వహించే వారికి ఆ వాస్తవం బాగా తెలుసు'. ఇంకా ఇలా రాశాను: 'క్రికెటింగ్‌కు సంబంధించిన ఇతర విషయాలు అన్నీ సమరీతిలో ఉంటే బౌలర్లు సైతం ప్రశస్త కెప్టెన్‌లుగా రాణించగలరు. శ్రీనాథ్ రంగంలో ఉండి, తన బౌలింగ్ ప్రతిభను ఉత్కృష్టంగా కొనసాగిస్తున్నంత వరకు ప్రత్యర్థి పక్షాన్ని పూర్తిగా చిత్తు చేయడం కుంబ్లేకు పెద్ద కష్టసాధ్యమైన పని కాబోదు. సమయం వచ్చినప్పుడు కుంబ్లేకు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించే విషయాన్ని తప్పక పరిగణనలోకి తీసుకోవాలి. బౌలర్లు ప్రభావశీల కెప్టెన్లు కాలేరన్న నిరాధార నమ్మకంతో కుంబ్లేకు కెప్టెన్సీని నిరాకరించకూడదు'. నేను క్రికెట్ అభిమానినే కానీ క్రికెట్ వ్యవహారాల నిర్వాహకులను ప్రభావితం చేయగలిగేవాడిని కాను కదా. ఈ కారణంగానే నా ప్రతిపాదన పరిశీలనకు నోచుకోలేకపోయింది. నేను ఆ వ్యాసం రాసి ఏడాది గడవక ముందే అజరుద్దీన్ కెప్టెన్సీ నుంచి నిష్క్రమించారు. ఆయన స్థానంలో సచిన్ టెండూల్కర్ వచ్చారు. సచిన్ గతంలో కెప్టెన్సీ బాధ్యతలు నిర్వహించారు. అయితే ఆ కెపెన్సీలో ఎలాంటి ప్రత్యేకత లేకపోయింది. ఎనిమిది టెస్ట్ మ్యాచ్‌ల అనంతరం సచిన్ కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. ఆయన స్థానంలో గంగూలీ వచ్చారు. వివిధ భారతీయ నగరాలలో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లలో టీమ్ ఇండియాకు ప్రశస్త విజయాలు సాధించిపెట్టిన చరిత్ర గంగూలీకి ఉన్నది. అయితే ఆయన బ్యాటింగ్ సామర్థ్యం క్షీణముఖం పట్టడంతో కెప్టెన్సీ బాధ్యతను రాహుల్ ద్రావిడ్‌కు అప్పగించారు. అజరుద్దీన్ అన్నిటి కంటే ముందుగా బ్యాటర్. అనితరసాధ్యమైన బ్యాటింగ్ ప్రతిభ ఆయన సొంతం. టీమ్ ఇండియా కెప్టెన్‌గా ఆయన వారసులు ముగ్గురూ%–%సచిన్, గంగూలీ, ద్రావిడ్%–% స్కిప్పర్లు. వికెట్లు పడగొట్టడం, మ్యాచ్‌లు గెలుచుకునేందుకు ఆ ముగ్గురూ అనిల్ కుంబ్లేపై ఆధారపడినవారే. అజరుద్దీన్ రిటైర్ అయిన తరువాత కెప్టెన్సీ అవకాశానికి కుంబ్లే 83 టెస్ట్ మ్యాచ్‌ల దాకా వేచి ఉండవలసివచ్చింది. 2007లో పాకిస్థాన్‌పై టీమ్ ఇండియాకు సారథ్యం వహించేందుకు కుంబ్లేకు ప్రప్రథమంగా అవకాశం లభించింది. నిజానికి అంతకు ముందు సంవత్సరాలలోను కుంబ్లేను కెప్టెన్‌గా నియమించి ఉన్నట్టయితే ఆయన ఎటువంటి విజయాలు సాధించి ఉండేవారో కదా? మ్యాచ్‌లు గెలవగలిగే సామర్థ్యంలో సచిన్‌కు లభించిన గౌరవమే కెప్టెన్‌గా కుంబ్లేకూ లభించింది. ఫీల్డ్‌లో గంగూలీ మాదిరిగా కుంబ్లే కూడా దూకుడుగా వ్యవహరించేవారు, ద్రావిడ్ వలే ఆయన కూడా సంపూర్ణంగా టీమ్‌కు కట్టుబడిన ఆటగాడు. నేను, మరికొంత మంది ఆశించినట్టు 1999లోనే కుంబ్లే కెప్టెన్ అయి ఉన్నట్టయితే దాదాపు ఒక దశాబ్ద కాలం పాటు ఆ బాధ్యతలను నిర్వర్తిస్తూ ఉండే అవకాశం ఆయనకు లభించి ఉండేది. మొత్తం మీద టీమ్ ఇండియా కెప్టెన్‌గా కుంబ్లే స్వల్పకాలం మాత్రమే ఉన్నారు. 2008లో పెర్త్‌లో జరిగిన టెస్ట్ మ్యాచ్ ఆయన కెప్టెన్సీ చరిత్రలో ఒక ఘనమైన రికార్డు. 2024 పెర్త్ టెస్ట్ వలే ఆనాడు కూడా టీమ్ ఇండియా దాదాపు ఓటమి అంచుకు చేరి అనూహ్యంగా విజయం సాధించింది. అంతకు ముందు సిడ్నీలో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో టీమ్ ఇండియా ఓడిపోయింది. అంపైరింగ్‌లో జరిగిన పొరపాట్లు కూడా ఆ సిడ్నీలో ఓటమికి కారణమయ్యాయి. అటువంటి ప్రతికూల పరిస్థితుల్లో అనిల్ కుంబ్లే నైరాశ్యంలో ఉన్న తన జట్టు సభ్యులను ఉత్సాహపరిచి పెర్త్‌లో విజయానికి నడిపించారు. అసాధారణమైన విజయమది. 2024లో సైతం స్వదేశంలో న్యూజిలాండ్ చేతుల్లో ఘోరంగా ఓడిపోయిన భారత్ జట్టు ఆస్ట్రేలియాలో ఆ దేశ జట్టుపై గెలవడం అసాధ్యమని క్రికెట్ అభిమానులు అందరూ తీర్మానించుకున్నారు. కెప్టెన్ రోహిత్ శర్మ, బ్యాటర్ శుభ్‌మన్‌గిల్ లేకపోవడం కూడా టీమ్ ఇండియాకు విజయావకాశాలు ఏ మాత్రం లేవనే అభిప్రాయానికి తావిచ్చింది. అయితే మొదటి రోజు చివరి దశలో భారత్ కెప్టెన్, ప్రతిభావంతుడైన బౌలర్ ఆస్ట్రేలియన్ బ్యాటింగ్ వెన్ను విరిచాడు. ఆ తరువాత రెండు రోజులు భారత ఆటగాళ్లు ప్రశస్తంగా ఆడి ప్రత్యర్థులను నిలువరించి తిరుగులేని విజయం సాధించారు. పెర్త్‌లో బౌలర్ కెప్టెన్ జస్ప్రీత్ బుమ్రా తన జట్టుకు నెరపిన అసాధారణ సారథ్యం విస్తృతంగా ప్రశంసలు పొందింది. ఆటలోనేకాదు, మ్యాచ్ ముగిసిన అనంతరం విలేఖర్ల సమావేశంలో బుమ్రా ప్రవర్తించిన తీరు కూడా అందరినీ ఆకట్టుకున్నది. సందేహం లేదు బుమ్రా అసాధారణ ప్రజ్ఞావంతుడు. పరిణత వ్యక్తి. రోహిత్ శర్మ రిటైర్మెంట్‌కు సమీపిస్తున్నందున ఆయన తరువాత కెప్టెన్సీ బాధ్యతలను బుమ్రాకు అప్పగించాలని ఇప్పటికే పలువురు సూచించారు. రోహిత్‌కు ప్రత్యామ్నాయంగా రిషబ్ పంత్‌ను కొంతమంది ప్రతిపాదించారు. బౌలర్ - కెప్టెన్లపై ఉన్న అపోహల కారణంగానే ఇటువంటి ప్రతిపాదనలకు ఆస్కారమేర్పడుతుంది.



# ఢిల్లీలో ‘మహా’ పంచాయితీ.

న్యూఢిల్లీ: మహారాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రి ఎవరనేదానిపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ పరిణామాల నడుమే రాష్ట్ర ఆపద్ధర్మ సీఎం ఏక్‌నాథ్ శిండే గురువారం రాత్రి కేంద్ర మంత్రి అమిత్ షా తో సమావేశమయ్యారు. సాయంత్రం ఢిల్లీకి చేరుకున్న ఆయన నేరుగా షా నివాసానికి చేరుకున్నారు. మరోవైపు బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, దేవేంద్ర ఫడ్నవీస్, ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్‌లు కూడా రాత్రి పది గంటల సమయంలో హౌంమంత్రి ఇంటికి చేరుకున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వ ఏర్పాటు విషయంలో మహాయుతి పక్షాల మధ్య భేటీ జరిగింది. రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు తాను అడ్డు కాబోనని.. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రి అమిత్ షాలు తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటానని ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిండఏ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో మహారాష్ట్ర సీఎం పగ్గాలు బీజేపీకే దక్కుతాయని, దేవేంద్ర ఫడ్నవీస్ మరోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. దీంతోపాటు డిప్యూటీ సీఎంలు, క్యాబినెట్ బెర్తులపై స్పష్టత రానుంది. అయితే ముఖ్యమంత్రిని ఓబీసీ చేస్తారా..లేక ట్రెండ్ మారుస్తారా..అన్నదే ఇపుడు హాట్ టాపిక్..

# పురోభివృద్ధిలో దేశ రక్షణ రంగం



కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ‘మేక్ ఇన్ ఇండియా’ కార్యాక్రమం కారణంగా దేశం వేగంగా వృద్ధి చెందుతోందని, ప్రత్యేకించి రక్షణ సాంకేతికత విషయాల్లో పురోభివృద్ధి చెందుతోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం పేర్కొన్నారు. తమిళనాడులో నీలగిరి సమీపాన కూనూర్‌లోని వెల్లింగ్టన్‌లో డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజ్ (డిఎస్ఎస్‌సి) జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు. డిఎస్ఎస్‌సిలో 28 దేశాలకు చెందిన 38 మంది అంతర్జాతీయ స్టూడెంట్ ఆఫీసర్లు కూడా వున్నారు. రక్షణ తయారీ కేందంగా భారత్ అభివృద్ధి చెందుతోందని, ఈ విషయాన్ని ప్రపంచ దేశాలు గుర్తించాయని ఆమె అన్నారు. రక్షణ ఎగుమతుల్లో అగ్రగామిగా వుంటూ విశ్వసనీయమైన రక్షణ భాగస్వామిగా మారుతోందన్నారు. హెచ్ఎఎల్, డిఆర్‌డిఓ వంటి స్థలు కొత్త ప్రామాణికాలను రూపొందిస్తున్నాయన్నారు. ప్రస్తుతం వందకు పైగా దేశాలకు భారత్ రక్షణ పరికరాలను ఎగుమతి చేస్తోందన్నారు. త్రివిధ బలగాల్లో మరింత ఎక్కువ మంది మహిళా అధికారులు ప్రవేశించాలని ఆమె ఆకాంక్షించారు. అంతకుముందు వెల్లింగ్టన్‌లోని యుద్ధ స్మారకం వద్ద పుష్పగుచ్ఛాలుంచి ఆమె నివాళులు అర్పించారు. భారత నావికాదళంలోకి కొత్తగా తీసుకున్న అణ జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిఘాత్ నుండి 3500 కిలోమీటర్ల దూరంలో లక్ష్యాన్ని ఛేదించగల కె-4 బాలిస్టిక్ క్షిపణిని గురువారం నేవీ ప్రయోగించింది. ఈ పరీక్షా ఫలితాలను విశ్లేషిస్తున్నట్ల రక్షణ వర్గాలు తెలిపాయి. ఆగస్టులో విశాఖపట్నంలోని షిప్ బిల్డింగ్ సెంటర్‌లో ఈ జలాంతర్గామిని నేవీలోకి తీసుకున్నారు. పూర్తి స్థాయిలో క్షిపణి ప్రయోగాన్ని చేపట్టడానికి ముందుగా నీటి అడుగున వేదికలపై నుండి క్షిపణిని ప్రయోగించే ట్రయల్స్‌ను కూడా డిఆర్‌డిఓ విస్తృతంగా చ్పేట్టింది.

## ఫడ్నవీస్‌కి సిఎం, షిండేకి హోమ్, అజిత్‌కి ఫైనాన్స్

ముంబై : ఈ నెల 23వ తేదీన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు విడుదలయ్యాయి. ఈ ఎన్నికల్లో మహాయతి కూటమి ఘన విజయం సాధించింది. అందులోనూ బిజెపి 100 మార్క్‌ను దాటి సీట్లను గెలుకుంది. ఈ నేపథ్యంలో బిజెపి నేత దేవేంద్ర ఫడ్నవీస్‌నే ముఖ్యమంత్రి అవుతారని అందరూ భావించారు. కానీ ఆ కూటమిలో నేతలే ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్‌లు సిఎం పదవికి పోటీ పడడంతో.. కొత్త సిఎం ఎవరనేది సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఎన్నికల ఫలితాలనంతరం మహాయతి కూటమి నేతలు కేంద్ర హెూంమంత్రి అమిత్ షాతో పలుమార్లు చర్చలు జరిపారు. రోజులు గడుస్తున్నా.. సిఎం పదవిపై ఇంతవరకూ స్పష్టత రాలేదు. అయితే ఫడ్నవీస్‌కే బిజెపి అధిష్టానం ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టే యోచనల్లో ఉన్నట్లు సమాచారం. ఏక్‌నాథ్ షిండేకి హెూంశాఖ, అజిత్ పవార్‌కు ఫైనాన్స్ ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

## ఇప్పుడు అజ్మీర్ దర్గా వంతు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా మసీదుల విషయంలో న్యాయస్థానాల్లో హిందూత్వ శక్తుల పిటిషన్ల పర్వం కొనసాగుతున్నది. రాజస్థాన్‌లోని అజ్మీర్ షరీఫ్ దర్గా పైనా ఒక పిటిషన్ దాఖలైంది. శివాలయం మీద నిర్మించారంటూ సదరు పిటిషన్‌ను పేర్కొన్నది. రాజస్థాన్‌లోని దిగువ కోర్టు ఈ పిటిష్‌ను విచారణకు స్వీకరించింది. అజ్మీర్ దర్గా కమిటీ, కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ)లకు నోటీసులు జారీ అయ్యాయని పిటిషనర్ తరఫు న్యాయవాది యోగేశ్ సిరోజా తెలిపారు. హిందూ సేన జాతీయ అధ్యక్షుడు విష్ణు గుప్తా ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. అజ్మీర్ వెస్ట్ సివిల్ జడ్జి మన్మోహన్ చంధేల్.. తదుపరి విచారణను డిసెంబర్ 20కి వాయిదా వేశారు. సూఫీ సన్యాసి ఖ్వాజా మొయినుద్దీన్ చిస్తీ సమాధి వాస్తవానికి శివుడి ఆలయమని విష్ణు గుప్తా తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అజ్మీర్ షరీఫ్ దర్గాలో కాశీ, మథుర వంటి హిందూ ఆలయం ఉన్నదని వివరించారు. దర్గా కిటికీలపై ఓం, స్వస్తిక్ చిహ్నాలు కనిపించాయని పేర్కొన్నది. దర్గా కమిటీని అక్కడి నుంచి తొలగించి, దర్గాను సర్వే చేయాలని కోరారు. అజ్మీర్ షరీఫ్ దర్గాను భగవాన్ శ్రీ సంకటమోచన మహాదేవ విరాజమాన్ ఆలయంగా ప్రకటించాలని వివరించారు. పిటిషన్‌ను స్వీకరించిన అజ్మీర్‌లోని స్థానిక కోర్టు అజ్మీర్ దర్గా కమిటీతో పాటు కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఏఎస్ఐలకు నోటీసులు జారీ చేసింది. మేము పిటిషన్ ఎందుకు దాఖలు చేస్తున్నామో చెప్పాలని కోర్టు ప్రశ్నించిందనీ, మా వాదనలను విన్న కోర్టు సంబంధిత పక్షాలకు నోటీసులు జారీ చేసిందని గుప్తా తెలిపారు.

## లెబనాన్‌పై ఇజ్రాయిల్ సైన్యం దాడి

బీరుట్: ఇజ్రాయిల్ - హిజ్బుల్లా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగి ఒకరోజు పూర్తి కాకుండానే దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయిల్ సైన్యం దాడి చేసింది. రాకెట్ నిల్వ కేంద్రంలో హిజ్బుల్లా కార్యకలాపాలను గుర్తించిన తరువాత లెబనాన్‌పై తమ యుద్ధ విమానాలు కాల్పులు జరిపాయని ఇజ్రాయిల్ పేర్కొంది. హిజ్బుల్లా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లగించడంతో దాడి చేశామని ఇజ్రాయిల్ పేర్కొంది. ఇజ్రాయిల్ - హిజ్బుల్లా మధ్య 14 నెలలుగా కొనసాగిన సంఘర్షణ కాల్పుల విరమణ ఒప్పందం ముగుస్తుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే దక్షిణ లెబనాన్‌లోని కొన్ని ప్రాంతాలకు తిరిగి రావడానికి ప్రయత్నిస్తున్న వ్యక్తులపై కాల్పులు జరిపినట్లు ఇజ్రాయిల్ మిలటరీ పేర్కొంది. వివరాలు ఇవ్వకుండానే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తున్నారని ఇజ్రాయిల్ ఆరోపించింది.

ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారని లెబనాన్ ప్రభుత్వ జాతీయ వార్తా సంస్థ తెలిపింది. ఇప్పటివరకు లెబనాన్‌పై ఇజ్రాయిల్ జరిపిన కాల్పుల్లో 3,760 మందికి పైగా లెబనాన్‌లు మరణించారని లెబనాన్ ఆరోగ్య అధికారులు తెలిపారు. వారిలో చాలా మంది పౌరులున్నారు. ఇజ్రాయిల్‌లో 70 మందికి పైగా మరణించారు. వారిలో సగం మంది పౌరులున్నారు.



## ఈ చట్టంతో చిన్నారులకు మేలు

సిడ్నీ : సోషల్ మీడియా నుండి 16 ఏళ్లలోపు వారిని నిషేధించే చారిత్రాత్మక చట్టం పిల్లలకు మేలు కలిగిస్తుందని ఆస్ట్రేలియా ప్రధాని పేర్కొన్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ వంటి సోషల్‌మీడియా ప్లాట్‌ఫారమ్‌లపై నిషేధంతో ఆస్ట్రేలియన్ యువకులకు మెరుగైన ఫలితాలు లభిస్తాయని, తక్కువ నష్టం ఉంటుందని ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది సరైన చర్య అని, తమ ప్రభుత్వానికి తల్లిదండ్రుల మద్దతు ఉంటుందని భావిస్తున్నామని కాన్‌బెర్రాలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన పేర్కొన్నారు. పిల్లల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడంపై సోషల్‌మీడియా ప్లాట్‌ఫారమ్‌లు ఇప్పుడు సామాజిక బాధ్యతను కలిగి ఉంటాయని అన్నారు. అన్నారు. అయితే ఈ చట్టం పూర్తిగా అమలవుతుందని చెప్పలేమని, 18 ఏళ్లలోపు వారికి మద్యపాన నిషేధం చట్టంతో దీనిని పోల్చారు. 16 ఏళ్ల కంటే తక్కువ వయసున్న చిన్నారులకు సోషల్ మీడియా వినియోగంపై నిషేధం విధిస్తూ పార్లమెంటు దిగువ సభలో బిల్లు ఆమోదం పొందిన సంగతి తెలిసిందే.

# ట్రంప్ హెచ్చరికల వల్ల అమెరికాకూ నష్టమే !



మెక్సికో సిటీ : తాను అధికారంలోకి వచ్చిన వెంటనే టారిఫ్‌లను భారీగా పెంచుతామని ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో మెక్సికో కూడా దీటుగానే స్పందించింది. అమెరికా టారిఫ్‌లు పెరిగితే మెక్సికో కూడా టారిఫ్‌లను పెంచుతుందని మెక్సికో అధ్యక్షులు క్లాడియా షబ్నమ్ చెప్పారు. బుధవారం ఒక పత్రికా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ వ్యాఖ్యలతో ప్రాంతీ వాణిజ్య యుద్ధం ఆరంభమైందని ఆర్థిక శాఖ మంత్రి మార్సెలో ఎబ్రార్డ్ హెచ్చరించారు. దీనివల్ల పెద్ద సంఖ్యలో అమెరికన్ కార్మికులు నష్టపోతారని, అమెరికాలో దాదాపు 4లక్షల ఉద్యోగాలను మూల్యంగా చెల్లించాల్సి వస్తుందని అన్నారు. మెక్సికోలో అమెరికా కార్ల తయారీ ప్లాంట్ల నుండి అందిన గణాంకాలపై చేసిన అధ్యయనం వివరాలను ఈ సందర్భంగా వివరించారు. కేవలం కార్మికులే కాదని, అమెరికా వినియోగదారులు కూడా దీనివల్ల ప్రభావితమవుతారని హెచ్చరించారు. అమెరికాలో బాగా ప్రజాదరణలో వుండే ట్రక్కులు మెక్సికోలో తయారవుతాయని చెప్పారు. ట్రంప్ టారిఫ్‌లను పెంచితే ఒక్కో కొత్త వాహనానికి 3వేల డాలర్లు అదనంగా ఖర్చవుతుందన్నారు. ఇటువంటి బెదిరింపులన్నీ ఆమోదయోగ్యం కానివని షబ్నమ్ వ్యాఖ్యానించారు. ట్రంప్‌తో తాను ఫోన్‌లో మాట్లాడానని ఆమె సోషల్‌మీడియాలో పోస్టు పెట్టారు. అమెరికా-మెక్సికో సరిహద్దు పొడవునా జరిగే వలసలపై చర్చించినట్లు చెప్పారు. ట్రంప్ భయాందోళనలను పోగొట్టేందుకు తాను ప్రయత్నించానని ఆమె తెలిపారు.

# ఆఫ్ఘన్‌లో జర్నలిస్టుల హక్కులపై దాడులు

కాబూల్ : 2021లో ఆఫ్ఘన్ను తాలిబన్ హస్తగతం చేసుకున్నప్పటి నుండి జర్నలిస్టుల హక్కులపై దాడి జరుగుతోందని యుఎన్ పేర్కొంది. 300కి పైగా జర్నలిస్టులు హక్కుల ఉల్లంఘనలకు గురయ్యారని తెలిపింది. వారిపై పలు కేసులు బనాయించడంతో పాటు అరెస్టులతో హింసిస్తోందని వెల్లడించింది. మీడియా రంగం తాలిబన్ ప్రభుత్వానికి దాసోహమైందని, దీంతో తాలిబన్ ప్రభుత్వ కఠిన నిబంధనలతో జర్నలిస్టుల హక్కులను అణిచివేస్తోందని అంతర్జాతీయ సంస్థలు మండిపడుతున్నాయి. యుఎన్ అసిస్టెన్స్ మిషన్ ఇన్ ఆఫ్ఘనిస్థాన్ (యుఎన్ఎఎంఎ), జెనీవాకు చెందిన మానవహక్కుల కార్యాలయం సంయుక్తంగా అధ్యయనం చేపట్టాయి. ప్రచురణపై నిషేధం, కఠిన ఆంక్షల వాతావరణంలో మీడియా సంస్థలు, జర్నలిస్టులు పనిచేస్తున్నాయని ఈ సర్వే తెలిపింది. 2021 ఆగస్టులో తాలిబన్‌లు ఆక్రమించుకున్నప్పటి నుండి ఈ సెప్టెంబర్ వరకు మానవ హక్కుల ఉల్లంఘన ఘటనలను యుఎన్ నివేదించింది. దీంతో 336 మంది జర్నలిస్టులు, మీడియా కార్యకర్తలు తీవ్రంగా ప్రభావితమయ్యారని పేర్కొంది. నిర్బంధం, అరెస్టు వంటి 256 ఘటనలు జరిగాయని, వేధింపులు, అగౌరవపరచడం వంటి 130 ఘటనలు జరిగాయని, 75 75 బెదిరింపు ఘటనలు జరిగాయని నివేదిక పేర్కొంది. తాలిబన్ ఆక్రమించుకునే సమయానికి ఆఫ్ఘన్‌లో 1700 మంది మహిళలతో పాటు 8,400 మంది జర్నలిస్టులు ఉన్నారు. ప్రస్తుతం 560 మంది మహిళలతో కలిపి కేవలం 5,100 మంది మాత్రమే జర్నలిస్టులు ఉన్నారని పేర్కొంది.

# పశ్చిమాసియా సంక్షోభంలో తొలి ఆశా కిరణం !



లిస్బన్ : తాజాగా ఇజ్రాయిల్, లెబనాన్‌లోని హిజ్బుల్లా మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం పశ్చిమాసియాను ముసురుకొన్న సంక్షోభం నేపథ్యంలో తొలి ఆశా కిరణమని ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటానియో గుటెరస్ వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందంలోని ఇరు పక్షాలు కూడా కాల్పుల విరమణ పట్ల నిబద్ధతను పాటిస్తూ, ఒప్పందాన్ని గౌరవించడం చాలా కీలకమని పేర్కొన్నారు. తన స్వస్థలమైన లిస్బన్‌కు వచ్చిన ఆయన టెలివిజన్‌లో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. కాల్పుల విరమణ ఎలా అమలవుతోందన్న అంశంపై లెబనాన్‌లోని ఐరాస శాంతి పరిరక్షక బలగాలు పర్యవేక్షించడానికి సిద్ధంగా వున్నాయన్నారు. గాజాలో కూడా తక్షణమే కాల్పుల విరమణ జరగాలని ఆయన ఆకాంక్షించారు. నెలల తరబడి అలుముకున్న అంధకారంలో తొలి ఆశా కిరణంగా లెబనాన్‌లో కాల్పుల విరమణ జరిగిందని, ఇది శుభ సూచకమని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఘర్షణలకు అపారమైన మూల్యాన్ని చెల్లించిన సామాన్య పౌరులకు ఇది చాలా కీలకమని పేర్కొన్నారు.

# జార్ఖండ్ సీఎంగా హేమంత్ సోరెన్



న్యూఢిల్లీ: జార్ఖండ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా హేమంత్ సోరెన్ ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర గవర్నర్ సంతోశ్ కుమార్ గంగ్వార్ ఆయన చేత ప్రమాణం చేయించారు. నాలుగోసారి ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని సాయంత్రం నాలుగు గంటలకు రాష్ట్ర రాజధాని రాంచీలోని మొరాబాదీ మైదానంలో నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతపక్షనేత రాహుల్ గాంధీ, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, సమాజ్‌వాదీ పార్టీ(ఎస్‌పీ) చీఫ్ అఖిలేశ్ యాదవ్, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, ఆయన భార్య సునీత కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, కర్నాటక ఉప ముఖ్యమంత్రి డి.కె శివకుమార్, ఆర్జేడీ నాయకులు తేజస్వీ యాదవ్ సహా పలువురు ఇండియా బ్లాక్ నేతలు హాజరయ్యారు. జార?ండ్‌లో వరుసగా రెండో సారి సీఎంగా గెలిచి, బాధ్యతలు చేపట్టిన ఏకైక ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ కావటం గమనార్హం. సీఎం ప్రమాణస్వీకారోత్సవం సందర్భంగా వీవీఐపీల రాకను దృష్టిలో ఉంచుకొని అధికారులు భద్రతను కట్టుదిట్టం చేశారు. సంప్రదాయ దుస్తులు ధరించిన గిరిజన బృందాలు వేదిక వద్ద పాటలకు నృత్యాలు చేశాయి. రాంచీలోని స్కూళ్లకు సెలవు ప్రకటించారు. ప్రమాణస్వీకారోత్సవానికి ముందు ఎక్స్ వేదికగా ఆయన బీజేపీని విమర్శించారు.

ఐకమత్యమే మన ఆయుధం. ఇందులో ఎలాంటి సందేహమూ లేదు. మనల్ని ఎవరూ విభజించలేరు. మౌనంగా ఉంచలేరు. వారు(బీజేపీ) మనల్ని వెనక్కి లాగితే, మనం ముందుకు వెళ్తాం. వారు మనల్ని మౌనంగా ఉంచే ప్రయత్నం చేస్తే, మన తిరుగుబాటు స్వరం మరింత పెద్దదవుతుంది. ఎందుకంటే, మనం జార?ండ్‌వాసులం. జార?ండ్‌వాసులు తలవంచరు” అని హిందీలో రాసుకొచ్చారు. ”మన పోరాటం ధృఢమైనది. ఎడతెగనిది. పోరాటం తుది శ్వాస వరకు కొనసాగుతుంది” అని పేర్కొన్నారు.

## తిరిగి దక్షిణ లెబనాన్‌కు పయనమైన స్థానికులు

బీరుట్ : ఇజ్రాయిల్, హిజ్బుల్లా కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత, వేలాది మంది గురువారం దక్షిణ లెబనాన్‌కు తిరిగి పయనమయ్యారు. భారీగా కార్లు, వ్యాన్‌లు టైర్ నగరం మీదుగా పయనిస్తున్న దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. ఇజ్రాయిల్ దాడులతో వేలాది మంది లెబనాన్‌ను విడిచి సురక్షిత ప్రాంతాలకు పారిపోయిన సంగత తెలిసిందే. రెండు నెలల అనంతరం ఓ తండ్రి, కుమార్తెలు తిరిగి కలుసుకున్న దృశ్యాలను జాతీయ మీడియా విడుదల చేసింది. ఈ సందర్భంగా కాల్పుల విరమణను స్వాగతిస్తున్నట్లు ప్రకటించింది. కాల్పుల విరమణతో పలువురు తిరిగి తమ కుటుంబ సభ్యులను కలుసుకుంటున్నారని పేర్కొంది. స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 5.00 గంటల నుండి 7.00 గంటల వరకు లిటాని నదికి దక్షిణంగా లెబనాన్ నివాసితులను వెళ్లవద్దని ఇజ్రాయిల్ సైన్యానికి చెందిన అరబిక్ ప్రతినిధి హెచ్చరించారు. ఇజ్రాయిల్ దళాలు ఇప్పటికి అక్కడ ఉన్నాయని అన్నారు. కాల్పుల విరమణ ఒప్పందం ప్రకారం.. లిటానికి దక్షిణంగా లెబనాన్ సైన్యం అదనపు దళాలను మోహరించడం ప్రారంభించిందని చెప్పారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని భారత్ స్వాగతించింది. చర్చలు, దౌత్యం ద్వారా ఇరు దేశాల మధ్య సమస్యను పరిష్కరించడానికి తాము మద్దతిస్తామని తెలిపింది. ఇజ్రాయిల్, హిజ్బుల్లా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం బుధవారం తెల్లవారుజాము నుండి అమల్లోకి వచ్చింది. అమెరికా, ఫ్రాన్స్ మధ్యవర్తిత్వంతో కుదిరిన ఈ ఒప్పందాన్ని ఇరుపక్షాలు ఆమోదించాయి.



# రోజుకో స్పూన్ తింటే అమేజింగ్ అంతే

చలికాలంలో పొడి వాతావరణం కారణంగా రోగాల బారిన పడే ప్రమాదముంది. జలుబు,దగ్గు, శ్వాసకోస సమస్యలు,గొంతు నొప్పి వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఇంకా ఎన్నో ఆరోగ్య సమస్యలు వెంటాడుతాయి. ఆరోగ్యమే మహాభాగ్యం ఉంటారు.చలికాలంలో పొడి వాతావరణం కారణంగా రోగాల బారిన పడే ప్రమాదముంది. జలుబు,దగ్గు, శ్వాసకోస సమస్యలు,గొంతు నొప్పి వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఇంకా ఎన్నో ఆరోగ్య సమస్యలు వెంటాడుతాయి. ఆరోగ్యమే మహాభాగ్యం ఉంటారు. ప్రస్తుత బిజీ లైఫ్ స్టైల్‌లో ప్రతి ఒక్కరికి ఆరోగ్యంగా ఉండటం ఎంతో ముఖ్యం. ఆరోగ్యంగా లేకపోతే ఆర్థికంగా, శారీరకంగా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇక చలికాలం మొదలైంది. చలికాలంలో పొడి వాతావరణం కారణంగా రోగాల బారిన పడే ప్రమాదముంది. జలుబు, దగ్గు, శ్వాసకోస సమస్యలు, గొంతు నొప్పి వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఎన్నో ఆరోగ్య సమస్యలు వెంటాడుతాయి. ఇలాంటి ఆరోగ్య సమస్యలకు చెక్ చెప్పడానికి కొన్ని ఫుడ్స్ ఆహారంలో చేర్చుకోవాలి. వంటింట్లో దొరికే చిన్న గింజలు ఎన్నో వ్యాధుల పనిపడతాయి. చలికాలంలో ఈ గింజల్ని ఒక స్పూన్ తింటే చాలు. కొలెస్ట్రాల్ తగ్గడంతో పాటు షుగర్ కూడా కంట్రోల్ అవుతుంది. ఇంతకీ ఆ గింజలు ఏంటి అనుకుంటున్నారు. నువ్వులు. అవును మీరు వింటున్నది నిజమే.! ఈ చిన్న గింజల్లో ఒక గ్లాస్ పాల కంటే 8 రెట్లు కాల్షియం ఎక్కువగా ఉంది. కాల్షియం మాత్రమే కాదు. నువ్వుల్లో ప్రోటీన్, ఫైబర్, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, మెగ్నీషియం, ఐరన్, జింక్స్ వంటి ఎన్నో పోషకాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. నువ్వుల్లో కాల్షియం ఎక్కువగా ఉంటుంది. చలికాలంలో ఒక స్పూన్ నువ్వులు తినడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయో ఇక్కడ తెలుసుకుందాం. నువ్వులు.. కొలెస్ట్రాల్ స్థాయిల్ని తగ్గించడంలో ముందుంటాయి. అధిక కొలెస్ట్రాల్, ట్రైగ్లెజరిడ్‌తో బాధపడేవాళ్లు.. మీ ఆహారంలో నువ్వులు భాగం చేసుకుంటే సరిపోతుంది. హార్ట్ పేషెంట్ అయితే.. నువ్వులు తీసుకోవడం చాలా లాభం. ఎందుకంటే నువ్వులు చెడు కొలెస్ట్రాల్ స్థాయిల్ని తగ్గిస్తాయి.

# పోషకాల గని తాటి బుర్రగుంజు..



తాటి చెట్టును ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కల్పవృక్షమని ఎందరో కవులు పలు సందర్భాల్లో అభివర్ణించారు. ఇందుకు కారణం కూడా ఉంది..ఎందుకంటే తాటి చెట్టులోని ప్రతి భాగము ఉపయోగకరమైనది కాబట్టే తాటి చెట్టును కల్పవృక్షంగా కవులు వర్ణిస్తారు. అలాంటి తాటి చెట్టు పిందె దశ నుండి చివరి దశ వరకు ప్రతిదీ మనకు పోషకాహారాన్ని అందించేదిగా చెబుతారు. అందులో ఒకటి తాటి బుర్రగుంజు.. తాటి పిందె దశలో కల్లును, 2వ దశలో రుచికరమైన ముంజులను,3వ దశలో అమోఘమైన సువాసనతో రుచికరమైన తాటి పండ్లను, చివరి దశలో తాటి బుర్ర నుండి గుంజు రుచికి రుచి అమోఘమైన పోషకాల గని. అందుకే పల్లెటూరు వాసులకు ఏడాదికి ఒకసారి దొరికే పోషకాల గని. బుర్రగుంజులో తక్కువ క్యాలరీస్ ఉండి, ఫైబర్ ఎక్కువగా ఉండటంతో జీర్ణక్రియ సక్రమంగా జరుగుతుందని చెబుతారు. తాటిబుర్ర గుంజు తీపితనం తక్కువ, కమ్మదనం ఎక్కువగా ఉండటంతో షుగర్ వ్యాధిగ్రస్తులు కూడా తినవచ్చని డాక్టర్లు చెబుతున్నారు. పల్లెటూర్లలో నాగుల చవితి వచ్చిందంటే తేగలతో పాటు, తాటి బుర్రగుంజును కూడా అమృతంలా లాగించేస్తుంటారు. పూర్వీకులు ఎటువంటి క్రిమిసంహారక మందులు వాడని బుర్ర గుంజును తినడం వల్లే నూటికి నూరేళ్లు ఆరోగ్యంగా బ్రతికే వారని మన పెద్దలు చెబుతున్నారు. నేడు పల్లెటూరి వాసులకు దొరికే అమృతం లాంటి తాటి బుర్ర గుంజు ఈ మధ్యకాలంలో హైవేల పక్కన అమ్మడం విశేషం%8% సంవత్సరానికి ఒకసారి దొరికే తాటి బుర్ర గుంజును తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. పల్లెటూర్లలో అయితే పొలం గట్లలో వేసిన తాటికాయలు బుర్రగుంజులా మారి.. తర్వాత తేగలుగా విక్రయిస్తుంటారు. బుర్రగుంజులో పోషకాలు ఎక్కువగా ఉండటం వల్ల వారానికి ఒకసారి గానీ, వారానికి మూడు రోజులు గాని తినడం వల్ల ఆరోగ్యకరమైన పోషకాలు అందుతాయని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల చాలా ఉపయోగాలు ఉండడం వల్ల వీటిని తినమని డాక్టర్లు కూడా సూచిస్తున్నారు.

# పనస గింజలు తింటే..

## ఇన్ని లాభాలా..!



పనస పండు.. దాదాపు అందరికీ తెలుసు.. దాని రుచి, సువాసన మనకు అంత దూరం నుంచే నోరూరించేలా చేస్తుంది. రుచికి మాత్రమే కాదు.. పనస పండు ఆరోగ్యానికి కూడా చాలా మంచి చేస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. అయితే, చాలా మంది పనస తొనలు తిని.. గింజలు పడేస్తుంటారు. పనస పండులోని పోషకాలతోపాటు.. వాటి గింజల వల్ల కలిగే ఉపయోగాలను కూడా మనం తెలుసుకోవాలి. పనస గింజల్లో బోలెడు పోషకాలుంటాయని, దీని గింజలు కూడా మీ శరీరానికి అద్భుతాలను చేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

అవేంటో ఇక్కడ తెలుసుకుందాం. పనస గింజల్లో ప్రొటీన్లు, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు ఒమేగా3, ఒమేగా 6 వంటి వాటితో పాటు విటమిన్లు A,C,E,B, ఇనుము, మెగ్నీషియం, పొటాషియం, జింక్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. పనస గింజలలో ఫైబర్ కూడా పుష్కలంగా ఉంటుందని.. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు.పనస గింజలలోని ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరచడంలో కూడా సహాయపడుతుంది. ఇది మలబద్ధకాన్ని నివారించడానికి మేలు చేస్తుంది. పనస గింజలలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయని.. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. పనస గింజల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుంచి శరీరాన్ని రక్షిస్తాయి. పనస గింజలలో ఉండే మెగ్నీషియం, పొటాషియం గుండె ఆరోగ్యానికి ముఖ్యమైన ఖనిజాలు. పొటాషియం రక్తనాళాలను సడలించి గుండె వ్యవస్థను మెరుగ్గా ఉంచుతుందని వివరిస్తున్నారు. పనస గింజలలోని యాంటీ ఆక్సిడెంట్లు క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధించేలా చేస్తాయి.బరువు తగ్గాలనుకునే వారికి పనస గింజలు తీసుకుంటే చక్కటి ఫలితం ఉంటుంది. ఎందుకంటే పనస గింజలలోని ఫైబర్.. ఎక్కువసేపు కడుపు నిండుగా ఉంచుతుంది. తద్వారా అతిగా తినడాన్ని నివారించడంలో, బరువు తగ్గడంలో సహాయపడుతుంది. పనస పండు గింజలలో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఇది ఎర్రరక్తకణాలను పెంచడంలో సహాయపడుతుంది.

# ఇది కొత్తిమీర కాదు, అలాంటిదే..

## బోలెడన్నీ లాభాలు..!



ప్రస్తుత జీవనశైలి, ఆహారపు అలవాట్ల వల్ల గ్యాస్, ఎసిడిటీ వంటి సమస్యలు సర్వసాధారణంగా మారాయి.. దీని వల్ల గుండెల్లో మంట, నెర్వస్ నెస్, విశ్రాంతి లేకపోవడం వంటి సమస్యలు పెరుగుతున్నాయి. దీనిని నివారించడానికి తక్షణ చికిత్స చాలా ముఖ్యం. ప్రతిరోజూ రాత్రి ఒకగ్లాసు సెలరీ జ్యూస్‌ను తాగితే చాలా సమస్యల నుంచి బయటపడొచ్చునని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.. అసలు సెలరీ అంటే ఏమిటి..? సెలరీ అనేది అపియాసి కుటుంబానికి చెందిన కూర. ఇది చూడడానికి కొంచెం కొత్తిమీరలా ఉంటుంది. సెలరీలో పోషకాలు అధికంగా ఉంటాయి. దీనిలో ఫైబర్ కంటెంట్ సమృద్ధిగా ఉంటుంది. విటమిన్ కె, సి, పొటాషియం, ఫోలేట్ వంటి పోషకాలు మెండుగా ఉంటాయి. సెలరీ జ్యూస్ తరచూ తీసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని, శరీరానికి కావలసిన పోషకాలు అందించవచ్చని నిపుణులు అంటున్నారు. సెలరీ జ్యూస్‌ని తగిన మోతాదులో తీసుకోవడం వల్ల పొట్ట సంబంధిత సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. సెలరీలో థైమోల్ అనే మూలకం ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఆహారాన్ని సులభంగా జీర్ణం చేస్తుంది. సెలరీ కడుపులో ఉన్న యాసిడ్‌ను తటస్థీకరించడంలో సహాయపడుతుంది. ఇది గుండెల్లో మంట, అసిడిటీ వంటి సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. సెలరీ ఎసిడిటీ సమయంలో కలిగే భయం, విశ్రాంతి లేకపోవడం నుండి కూడా ఉపశమనాన్ని అందిస్తుంది. ఊబకాయంతో బాధపడేవారికి కూడా సెలరీ చాలా ఉపయోగకరంగా పరిగణించబడుతుంది. ఇదీ కాకుండా, ఫంగల్ ఇన్ఫెక్షన్ల నుండి రక్షించడంలో కూడా సెలరీ సహాయపడుతుంది. ఇది మాత్రమే కాదు, సెలెరీ మహిళలకు కూడా చాలా ఉపయోగకరం. ఇది పీరియడ్స్ సమయంలో కడుపు నొప్పి నుండి ఉపశమనం కలిగిస్తుంది. సెలెరీలో అధిక స్థాయిలో ఆండ్రోస్టెనోన్, ఆండ్రోస్టెనాల్ ఉన్నాయి. ఇవి పునరుత్పత్తి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. పురుషులు, స్త్రీలలో సంతానోత్పత్తిని పెంచుతాయి. మీరు జుట్టు సమస్యలతో బాధపడుతుంటే మీరు ఆకుకూరలను తినవచ్చు. ఇది జుట్టును బలంగా, మందంగా చేస్తుంది. ఇందులో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇది మీ శరీరంలో మంటను నివారిస్తుంది. అనారోగ్యాల నుండి రక్షిస్తుంది. ఈ ఆకుపచ్చ కూరగాయలలో యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి. ఇవి ఆక్సీకరణ నష్టాన్ని నివారిస్తాయి.జీర్ణక్రియను ప్రోత్సహిస్తాయి. ఇందులో అపియుమాన్ అనే సమ్మేళనం ఉంది. ఇది అల్సర్, జీర్ణ సమస్యల వంటి కడుపు సమస్యలను నివారిస్తుంది. అధ్యయనాల ప్రకారం, సెలెరీ రక్తపోటు స్థాయిలను తగ్గించడానికి సహాయపడుతుంది.

# ఇది పండు కాదు.. పోషకాల పవర్ హౌస్..



పండ్లలో అనేక రకాల విటమిన్లు, పోషకాలు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. వీటితో ఎన్నో అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టవచ్చు... ఇంకా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.. అలాంటి పండ్లను మోసంబి ఒకటి.. ఈ పండును డైలీ ఆహారంలో భాగం చేసుకుంటే ఆరోగ్యానికి తిరుగుండదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ప్రకృతిలో లభించే ఎన్నో రకాల పండ్లు మన ఆరోగ్యానికి బోలెడన్ని ప్రయోజనాలను అందిస్తాయి.. వాస్తవానికి పండ్లలో అనేక రకాల విటమిన్లు, పోషకాలు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. వీటితో ఎన్నో అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టవచ్చు.. ఇంకా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.. అలాంటి పండ్లలో మోసంబి ఒకటి. దీనిని బత్తాయి – నారింజ అని కూడా అంటారు. అయితే.. నారింజకు భిన్నంగా మోసంబి పచ్చిగా.. తీపి–పుల్లని రుచితో ఉంటుంది. మోసంబిలో విటమిన్ సి, పొటాషియం, ఫైబర్, మెగ్నీషియం, ఐరన్, ఫాస్పరస్, కాల్షియం వంటి శరీరానికి ఉపయోగపడే అనేక పోషకాలు ఉంటాయి. దీంతోపాటు మోసంబిని విటమిన్ సి పవర్ హౌస్ అని కూడా అంటారు.. అందుకే.. చాలామంది ఉదయాన్నే లేదా వీలు దొరికినప్పుడల్లా మోసంబి జ్యూస్ తాగుతుంటారు.. ఈ మోసంబిలో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు దాగి ఉన్నాయని.. సహజ ద్రవాలు, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉన్న ఈ పండును డైలీ ఆహారంలో భాగం చేసుకుంటే ఆరోగ్యానికి తిరుగుండదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పోషకాల పవర్ హౌస్: విటమిన్ సి, విటమిన్ ఎ, ఫైబర్ మంచి మొత్తంలో ఉంటాయి.. ఇవి మీ శరీరానికి మేలు చేస్తాయి.. మోసంబి వినియోగం వల్ల శరీరంలో అనేక పోషకాల లోపం ఉండదు.. దీంతోపాటు ఆరోగ్యం మెరుగుపడుతుంది.. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది: మోసాంబిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది.. ఇది శరీర రోగనిరోధక శక్తిని పెంచుతుంది. జలుబు, దగ్గు, ఫ్లూ, ఇతర వైరల్ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. జీర్ణక్రియ మెరుగుపడుతుంది: మోసంబి జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగిస్తుంది.. మిమ్మల్ని తేలికగా, చురుకుగా ఉంచుతుంది. బరువు తగ్గుతుంది: మోసంబి తినడం లేదా జ్యూస్ తాగడం వల్ల.. ఇది పెరుగుతున్న బరువును నియంత్రించడంలో సహాయపడుతుంది.. ఎందుకంటే ఇది తక్కువ కేలరీల ఆహారం. ఇది పొట్ట, నడుము చుట్టూ కొవ్వును కరిగిస్తుంది.. ఫిట్‌నెస్‌పై ఆందోళనతో ఉన్నవారు మోసంబి జ్యూస్‌ను తప్పనిసరిగా తాగాలి. మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది: మోసంబి మీ మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇది ఉద్రిక్తత, ఒత్తిడిని తొలగించడంలో సహాయపడుతుంది. మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరిచే విషయంలో ఇది ఔషధం కంటే ఇది తక్కువ కాదంటున్నారు ఆరోగ్య నిపుణులు..

# యువతలో గుండెపోటు ఎందుకు ?




మారుతున్న జీవన విధానంలో గుండెపోటుతో మరణించే వారి సంఖ్య పెరుగుతోంది. ప్రస్తుతం లైఫ్ స్టైల్ కారణంగా గుండె సంబంధిత వ్యాధులు వస్తున్నాయి. ఇప్పుడున్న రోజుల్లో ఆరోగ్యంగా ఉండేందుకు ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి.. ఇటీవల కాలంలో గుండెపోటుతు మరణించే వారి సంఖ్య పెరిగిపోతోంది. గుండెపోటు ఎప్పుడు వస్తుందో? తెలియని పరిస్థితి. యువకులను సైతం వదలడం లేదు. ఆరోగ్యంగా ఉన్నారనుకున్న సెలబ్రెటీలు, క్రికెట్ ప్లేయర్లు దీనిబారిన పడుతున్నారు. తాజాగా పుణె వేదికగా ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో ఓ క్రికెటర్ మైదానంలోనే కుప్పకూలి ప్రాణాలు వదిలాడు. అప్పటివరకూ తమతో ఆడుతున్న ఆటగాడు ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. 35 ఏళ్ల ఇమ్రాన్ పటేల్ ఓపెనర్‌గా క్రీజ్‌లోకి వచ్చాడు. కాసేపటికే ఎడమవైపు ఛాతీలో నొప్పిగా ఉందంటూ సహచరులకు చెబుతూ కుప్పకూలాడు. అయితే గుండెపోటుతో మృతి చెందినట్లు గుర్తించారు. ఇలా యువతలో గుండెపోటు కేసులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఈ రోజుల్లో యువతలో గుండెపోటు కేసులు ఎందుకు పెరుగుతున్నాయి.. దాని నుండి రక్షించువడం ఎలా అనే విషయాలను తెలుసుకోవడం ఎంతో ముఖ్యం. ఒత్తిడి: బాధ్యతల బారం లేదా ఇతర కారణాల వల్ల, ఎవరైనా ఒత్తిడి సమస్యను ఎదుర్కొంటారు. ఒత్తిడి పెరిగితే అది డిప్రెషన్ వంటి తీవ్రమైన సమస్యలను సృష్టిస్తుంది. దీంతో చాలా మంది యువతలో ఒత్తిడి కారణంగా గుండెపోటు వస్తుంది. ఆహారం: ఇప్పుడున్న బిజీ లైఫ్‌లో చాలా మంది యువత తమ ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. చాలా సార్లు ప్రజలు బయటి నుంచి జంక్ ఫుడ్, ఆయిల్ ఫుడ్ తినేందుకు ఆసక్తి చూపుతుంటారు. ఈ రకమైన ఆహారం వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పెరుగుతుంది. వీటిని అధికంగా తీసుకోవడం వల్ల శరీరంలో అధిక బీపీ, ఇతర సమస్యలు తలెత్తుతాయి. దీని కారణంగా గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. జీవనశైలి: నేటి యువతలో చాలా మంది జీవనశైలి చాలా చెడిపోయింది.

# సినిమా



## హైదరాబాద్‌లో పుష్ప 2 ప్రీ రిలీజ్ ఈవెంట్

డైరెక్టర్ సుకుమార్ రూపొందించిన పుష్ప 2 పై ఇప్పటికే భారీ హైప్ నెలకొంది. మరోవైపు ఈ ప్రాజెక్ట్ పై ప్రేక్షకులలో మరింత ఆసక్తిని కలిగించేందుకు చిత్రయూనిట్ విభిన్నంగా ప్రమోషన్స్ నిర్వహిస్తుంది. డిసెంబర్ 5న ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున విడుదల కానుంది. దీంతో దేశవ్యాప్తంగా పలు ప్రధాన నగరాల్లో ఈ మూవీ ప్రమోషన్స్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే పాట్నాలో ఘనంగా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహించింది మూవీ టీం. మరోవైపు చెన్నై, కొచ్చి, ముంబయి ఈ మూవీ ఈవెంట్స్ నిర్వహించారు. అల్లు అర్జున్, రష్మిక మందన్నా తమ సినిమా ప్రమోషన్స్ కోసం తెగ కష్టపడుతున్నారు. అయితే సౌత్ టూ నార్త్ పుష్ప 2 మూవీ ప్రమోషన్స్ జోరుగా జరుగుతున్నాయి. కానీ ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో ఎప్పుడూ ఈవెంట్ నిర్వహిస్తారు అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు ఫ్యాన్స్. తాజాగా వీటిపై క్లారిటీ వచ్చినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ లోనే ఈ మూవీ వేడుక నిర్వహించనుండగా.. మేకర్స్ ప్లాన్ లో చిన్న మార్పు జరిగినట్లు తెలుస్తోంది. పుష్ప 2 మూవీ ఈవెంట్ కోసం ఎన్ని లక్షల మంది వస్తారనే విషయంపై ఆసక్తి నెలకొంది. గత కొన్ని రోజులుగా యూసుఫ్ గూడ పోలీస్ లైన్స్ లో భారీ ఓపెన్ ప్లేస్ లో ఈ మూవీ ఈవెంట్ జరగనుందనే టాక్ నడిచింది. అంతకు ముందు రామోజీ ఫిల్మ్ సిటీ మెయిన్ గేట్ వద్ద ఈ ఈవెంట్ జరగనుందని టాక్ నడిచింది. ఇక ఇప్పుడు మరో న్యూస్ తెరపైకి వచ్చింది. నెట్టింట వినిపిస్తున్న టాక్ ప్రకారం పుష్ప 2 ప్రీ రిలీజ్ ఈవెంట్ మల్లారెడ్డి కాలేజీలో నిర్వహించనున్నారని తెలుస్తోంది. అయితే పోలీసుల అనుమతి, ఇతర విషయాలపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది.ల డిసెంబర్ 1న మల్లారెడ్డి కాలేజ్ గ్రౌండ్స్ లో ఈ ఈవెంట్ జరగనుందని తెలుస్తోంది. ప్రస్తుతం అల్లు అర్జున్ ఈ మూవీ ప్రమోషన్స్ కోసం ముంబై వెళ్లిన సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో రష్మిక, జగపతి బాబు, ఫహద్ ఫాజిల్ కీలకపాత్రలో నటిస్తుండగా.. శ్రీలీల స్పెషల్ సాంగ్ చేస్తుంది.




## విడాకుల గురించి మళ్లీ మాట్లాడిన సమంత

సెలబ్రిటీల జీవితంలో జరిగిన కొన్ని విషయాల గురించి ఎన్ని సార్లు మాట్లాడుకున్నా ఆసక్తిగానే వింటారు జనాలు. అందులోనూ ఇప్పుడున్న సిట్యువేషన్‌లో సమంత విడాకుల గురించి మెన్షన్ చేస్తే పట్టించుకోకుండా ఉంటారా? డబుల్ ఇంట్రస్ట్ తో వింటున్నారు. సెలబ్రిటీల జీవితంలో జరిగిన కొన్ని విషయాల గురించి ఎన్ని సార్లు మాట్లాడుకున్నా

ఆసక్తిగానే వింటారు జనాలు. అందులోనూ ఇప్పుడున్న సిట్యువేషన్‌లో సమంత విడాకుల గురించి మెన్షన్ చేస్తే పట్టించుకోకుండా ఉంటారా? డబుల్ ఇంట్రస్ట్ తో వింటున్నారు. రీసెంట్‌గా సినిమా ఇండస్ట్రీలో విడాకుల వార్తలు రిపీటెడ్‌గా వినిపిస్తున్నాయి. సరిగ్గా ఈ టైమ్‌లోనే తాను విడాకుల సమయంలో ఫేస్ చేసిన విషయాల గురించి మాట్లాడారు సమంత. రిలేషన్‌షిప్ బ్రేక్ అయినప్పుడు అమ్మాయిలు ఎక్కువ నిందలు పడతారన్నారు.

## మాజీ భార్య గురించి అమీర్ ఖాన్ కామెంట్స్



లాపతా లేడీస్ మూవీతో ఆస్కార్ బరిలో దిగుతున్న ఆమిర్ ఖాన్, ఆ సినిమాను హాలీవుడ్‌లోసీరియస్‌గా ప్రమోట్ చేస్తున్నారు. హెూల్ యూనిట్‌తో అమెరికాలోనే స్టే చేసి సినిమాను వెస్ట్రన్ ఆడియన్స్‌కు దగ్గర చేసేందుకు కష్టపడుతున్నారు. ఈ సందర్భంగా ఇంట్రస్టింగ్ కామెంట్స్ చేశారు ఆమిర్ ఆమిర్ ఖాన్ నిర్మాతగా ఆయన మాజీ భార్య కిరణ్ రావు దర్శకత్వంలో తెరకెక్కిన డిఫరెంట్ మూవీ లాపతా లేడీస్. కామెడీ డ్రామాగా రూపొందిన ఈ సినిమా థియేట్రికల్ రిలీజ్‌లో పరవాలేదనిపించినా... ఓటీటీలో ఘన విజయం సాధించింది. అంతేకాదు ఆస్కార్ బరిలో ఇండియా నుంచి పోటికి ఎంపికై మరో రికార్డ్ సెట్ చేసింది. ప్రస్తుతం ఈ సినిమాను హాలీవుడ్‌లో ప్రమోట్ చేస్తున్న ఆమిర్ ఖాన్, యూనిట్‌తో కలిసి వరుస ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. ఈ సందర్భంగా తన కెరీర్‌లో కిరణ్‌కు ఉన్న ఇంపార్టెన్స్ గురించి ఇంట్రస్టింగ్ కామెంట్స్ చేశారు.

## హాట్ ఫోటోస్ తో రచ్చ చేస్తున్న తమన్నా..!

తెర మీద ఎలా ఉన్నా.. సోషల్ మీడియాలో మాత్రం తగ్గేదే లే అంటున్నారు సీనియర్ బ్యూటీ తమన్నా. కమర్షియల్ హీరోయిన్‌గా అవకాశాలు తగ్గిపోవటంతో డిఫరెంట్ మూవీస్ చేస్తున్న ఈ బ్యూటీ.. సోషల్ మీడియాలో మాత్రం తగ్గేదే లే అంటున్నారు. 20 ఏళ్లుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్నా ఇప్పటికీ అదే గ్లామర్ మెయిన్‌టైన్ చేస్తున్నారు మిల్కీ బ్యూటీ తమన్నా. కెరీర్‌లో అప్స్ అండ్ డౌన్స్ ఉన్నా.. సినిమా, ఓటీటీ ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉన్నా.. ఫ్యాన్స్ కోసం ఫోటోషూట్స్ చేసేందుకు కూడా టైమ్ కేటాయిస్తున్నారు. ప్రస్తుతం ఎక్కువగా లేడీ ఓరియంటెడ్ సినిమాల మీదే దృష్టి పెట్టిన తమన్నా, హిందీలో సికందర్ కా ముఖద్దర్, తెలుగులో ఓదెలా 2 సినిమాల్లో నటిస్తున్నారు. డిజిటల్లో డేరింగ్ పార్టనర్స్ అనే వెబ్ సిరీస్‌లోనూ కనిపించబోతున్నారు.






## పెరుగుతున్న పాన్ ఇండియా స్టార్స్ రేంజ్.. తగ్గదేలే అంటున్న టాలీవుడ్ హీరోలు

ఎవరైనా మెట్టుకు మెట్టూ ఎక్కాక.. ఆ పైమెట్టు మీదే కాన్‌సెన్‌ట్రేట్ చేస్తారు కానీ, ట్రావెల్ చేసొచ్చిన కింది మెట్టు మీద కాసేపు రిలాక్స్ కావాలని అనుకుంటారా? అదే పనిగా అనుకోరేమోగానీ.. ఎప్పుడో ఓ సారి మెమరీస్ హాంట్ చేస్తే మళ్లొక్కసారి వెళ్లి చూసి రావాలనిపిస్తుంది కదా... యాజ్ ఇట్ ఈజ్‌గా అలాగే అనిపిస్తే.. మన స్టార్ హీరోల డెసిషన్ ఎలా ఉంటుంది? నేను చేసే ఆఖరి రీజినల్ సినిమా ఇదేనేమో.. అంటూ గుంటూరు కారం సినిమా టైమ్‌లోనే ఓపెన్‌గా చెప్పేశారు మహేష్. ఇప్పుడు జక్కన్నతో ఇంటర్నేషనల్ సినిమా చేస్తున్న ఆయన ఫ్యూచర్‌లో ఆ పైపైకే చూడటం ఖాయం. గుంటూరు కారం చేస్తున్న సమయంలో మహేష్‌కి ఉన్న ఈ నెక్స్ట్ రేంజ్ క్లారిటీ... బాహుబలి చేస్తున్నప్పుడు ప్రభాస్‌కి లేదనే చెప్పాలి. ఇంత స్పాన్‌ని ఆలోచించేలోపే ఆ రేంజ్‌కి చేరుకున్నారు డార్లింగ్. మహేష్‌కి ఉన్న వెసులుబాటు తారక్‌కి కూడా ఉంది. ట్రిపుల్ ఆర్‌తో పెరిగిన స్పాన్‌ని దేవరతో కంటిన్యూ చేసుకోగలిగారు తారక్. నెక్స్ట్ వార్2తో మరో స్టెప్ ముందుకేశారు. ఆ తర్వాత నార్త్ ప్రాజెక్టులు చేస్తారనే టాక్ ఉంది.. మరి ఇన్నిటి నడుమ ఒక్క క్షణం ఆగి రీజినల్ సినిమా చేసే తీరిక ఉంటుందా?

## సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ టూ కాస్ట్యూమ్ డిజైనర్‌గా

తాజాగా ప్రముఖ ఓటీటీ చానెల్ జీ5లో స్ట్రీమింగ్ అవుతోన్న డిటెక్టివ్ వెబ్ సిరీస్ 'వికటకవి' సిరీస్‌కు ఆమె వర్క్ చేశారు. నరేష్ అగస్త్య, మేఘా ఆకాష్ ప్రధాన పాత్రల్లో ప్రదీప్ మద్దాలి దర్శకత్వంలో ఎస్.ఆర్.టి.ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై ప్యాషనేట్ ప్రొడ్యూసర్ రామ్ తాళ్లూరి వికటకవి వెబ్ సిరీస్‌ను నిర్మించారు. నవంబర్ 28 నుంచి జీ5లో స్ట్రీమింగ్ కానుంది. గాయత్రి దేవి మాట్లాడుతూ.. "పుట్టింది విజయనగరం.. పెరిగిందంతా చెన్నై. ఇంటర్ వరకు చెన్నైలోనే చదువుకున్నాను. కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేశాను. సామ్ సంగ్‌లో జాబ్ చేశాను. తర్వాత మైక్రోసాఫ్ట్‌లో జాయిన్ అయ్యాను. ఆ సమయంలో నేను హైదరాబాద్ వచ్చాను. ఇండియా డెవలప్‌మెంట్ సెంటర్‌లో డెవలపర్‌గా వర్క్ చేశాను. మూడేళు హైదరాబాద్‌లో వర్క్ చేసిన తర్వాత కొన్ని వ్యక్తిగత కారణాలతో జాబ్‌కి రిజైన్ చేసేశాను" అని అన్నారు.



## మరో సచిన్ అవుతాడనుకుంటే

# అన్‌సోల్డ్‌గా మిగిలాడు..

నెక్ట్స్ సచిన్ అని అటు మాజీ క్రికెటర్లతో పాటు ఇటు అనలిస్టులతోనూ ప్రశంసలు అందుకున్న ఆ ప్లేయర్ మరెవరో కాదు.. పృథ్వీ షా. చిన్న వయసులోనే అందరి దృష్టిని ఆకర్షించాడు షా. అండర్-19 వరల్డ్ కప్-2018లో భారత జట్టును విజేతగా నిలబెట్టాడు. కెప్టెన్‌గా, బ్యాటర్‌గా అదరగొట్టాడు. దీంతో అదే ఏడాది అటు ఐపీఎల్‌లో ఇటు ఇండియన్ టీమ్‌లో ఆడే అవకాశాన్ని దక్కించుకున్నాడు. కెరీర్ మొదట్లో అతడి బ్యాటింగ్ స్కిల్స్ చూసి తోపు ఆటగాళ్లు కూడా షాక్ అయ్యారు. బంతిని అతడు టైమ్ చేసే విధానం, టెక్నిక్‌కు ఫిదా అయిపోయారు. ఇలాంటి బ్యాటర్‌ను కెరీర్‌లోనే చూడలేదంటూ రికీ పాంటింగ్ లాంటి దిగ్గజాలు పొగడ్తల వర్షం కురిపించారు. దీంతో వరల్డ్ క్రికెట్‌లో సంచలన ప్లేయర్ వచ్చేశాడంటూ అందరూ ప్రశంసల్లో ముంచెత్తారు.





# 42 పరుగులకే ఢమాల్

దర్బన్: దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్ మొదటి ఇన్నింగ్స్‌లో శ్రీలంక 42 పరుగులకే కుప్పకూలింది.

ఈ క్రమంలో పర్యాటక జట్టు ఎన్నో చెత్త రికార్డుల్ని మూటగట్టుకుంది. సుదీర్ఘ ఫార్మాట్‌లో లంకేయులకిది అత్యల్ప స్కోరు. ఆ జట్టు గత అత్యల్ప స్కోరు 71. రెండు దశాబ్దాల కిందట క్యాండీలో పాకిస్థాన్‌పై ఆ స్కోరు సాధించింది. పేసర్ మార్కో జాన్సెన్ కెరీర్‌లో ఉత్తమ బౌలింగ్‌తో (6.5-1-13-7) చెలరేగడంతో శ్రీలంక 13.5 ఓవర్లలోనే కుప్పకూలింది. దాంతో గత వందేళ్లలో టెస్ట్ క్రికెట్‌లో అతి తక్కువ బంతుల్లో (78) ఆలౌట్ అయిన జట్టుగా కూడా లంకేయులు మరో రికార్డు సొంతం చేసుకున్నారు. కాగా..తన స్పెల్‌లో ఏడు ఓవర్లలోపే ఏడు వికెట్లు పడగొట్టిన రెండో బౌలర్‌గా జాన్సెన్ రికార్డు సృష్టించాడు. 1924లో ఇంగ్లండ్‌పై ఆస్ట్రేలియా స్పిన్నర్ హగ్ టంబెల్ (6.5-0-28-7) తొలిసారి ఈ ఫీట్ నమోదు చేశాడు.

అంతకుముందు ఓవర్‌నైట్ 80/4 స్కోరుతో గురువారం మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆతిథ్య జట్టు 191 పరుగులకు ఆలౌటైంది. శ్రీలంకను స్వల్ప స్కోరుకే కట్టడి చేసిన సఫారీలు..రెండో ఇన్నింగ్స్‌లో రెండోరోజు ఆఖరికి 132/3 స్కోరు చేశారు. ఓవరాల్‌గా 281 పరుగుల ఆధిక్యంలో నిలిచారు.



## రాసి పెట్టుకోండి..

# ఆర్సీబీకి అతడే కెప్టెన్

వచ్చే ఇండియన్ ప్రీమియర్ లీగ్ కోసం టీమ్స్ అన్నీ తమ ఆయుధాలను తయారు చేసుకున్నాయి. ఇటీవల జరిగిన మెగా ఆక్షన్‌లో తమకు కావాల్సిన ప్లేయర్లను తీసుకున్నాయి. కోట్ల వర్షం కురిపించి బలమైన స్క్వాడ్‌లను సిద్ధం చేసుకున్నాయి. క్యాష్ రిచ్ లీగ్‌లో హ్యూజ్ ఫ్యాన్‌బేస్ ఉన్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కూడా మంచి ఆటగాళ్లను దక్కించుకుంది. ముఖ్యంగా తమ బౌలింగ్ లైనప్‌ను పటిష్టంగా చేసుకుంది. భువనేశ్వర్ కుమార్, జోష్ హేజల్‌వుడ్ లాంటి సీనియర్ బౌలర్లతో ఆ జట్టు బౌలింగ్ అటాక్ దుర్భేధ్యంగా కనిపిస్తోంది. అటు విరాట్ కోహ్లీ, రజత్ పాటిదార్‌తో కూడిన బ్యాటింగ్ యూనిట్ కూడా బాగుంది. అయితే కెప్టెన్సీ ఇష్యూ మళ్లీ మొదటికొచ్చింది. గత సీజన్ వరకు కెప్టెన్‌గా టీమ్‌ను ముందుండి నడిపించిన ఫాఫ్ డుప్లెసిస్‌ను ఆర్సీబీ వదలుకుంది. వేలంలోనూ అతడ్ని రీటెయిన్ చేసుకోలేదు. దీంతో వచ్చే సీజన్‌లో ఆ జట్టుకు సారథి ఎవరనేది ప్రశ్నార్థకంగా మారింది. టాప్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మరోమారు ఆ జట్టు బాధ్యతల్ని చేపట్టాలని ఫ్యాన్స్ నుంచి డిమాండ్స్ వస్తున్నాయి. కానీ దీనిపై అటు బెంగళూరు మేనేజ్‌మెంట్ నుంచి గానీ ఇటు కోహ్లీ నుంచి గానీ ఎటువంటి హామీ రాలేదు. తాజాగా ఈ అంశంపై ఆర్సీబీ మాజీ ప్లేయర్, సౌతాఫ్రికా లెజెండ్ ఏబీ డివిలియర్స్ స్పందించాడు. కోహ్లీనే బెంగళూరు జట్టు సారథ్య పగ్గాలు తీసుకుంటాడని.. రాసి పెట్టుకోవాలని అతడు వ్యాఖ్యానించాడు. 'కెప్టెన్సీపై కోహ్లీ ఇప్పటిదాకా ఎలాంటి ప్రకటన చేయలేదు. అయితే ఆర్సీబీ స్క్వాడ్‌లో అతడ్ని మించిన కెప్టెన్సీ ఆప్షన్ కనిపించడం లేదు. ఆ టీమ్‌లో విరాట్ మాత్రమే సారథ్యం చేయగల సత్తా ఉన్న క్రికెటర్ అని చెప్పాలి. మెగా ఆక్షన్‌లో బెంగళూరు మంచి జట్టునే తీసుకుంది. భువనేశ్వర్, హేజల్‌వుడ్‌తో పాటు లుంగి ఎంగిడి లాంటి క్వాలిటీ పేసర్లను తీసుకున్నారు. స్లో డెలివరీస్‌తో అతడు ప్రత్యర్థులకు సమస్యలు సృష్టించగలడు. అయితే ఆర్సీబీ స్పిన్ యూనిట్ కాస్త ఆందోళన కలిగిస్తోంది. విన్నింగ్ స్పిన్నర్ లేని లోటును ఆ జట్టు ఎలా అధిగమిస్తుందో చూడాలి' అని డివిలియర్స్ చెప్పుకొచ్చాడు.

# యు ముంబాను మట్టికరిపించిన తెలుగు టైటాన్స్



ప్రోకబడ్డీ లీగ్ సీజన్-11లో తెలుగు టైటాన్స్ సత్తాచాటుతోంది. తిరిగి గెలుపు బాట పట్టి పాయింట్ల పట్టికలో మరోసారి రెండో స్థానానికి ఎగబాకింది. నొయిడా వేదికగా యు ముంబాతో గురువారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 41-35 తేడాతో ఘన విజయం సాధించింది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 14 మ్యాచ్‌లు ఆడిన తెలుగు టైటాన్స్‌కు ఇది తొమ్మిదో విజయం. అగ్రస్థానంలో హర్యానా స్టీలర్స్ (14 మ్యాచ్‌ల్లో 11 విజయాలు) ఉంది. మ్యాచ్ ఆరంభం నుంచే యు ముంబాపై తెలుగు టైటాన్స్ విరుచుకుపడింది. తొలి అర్ధభాగంలోనే రెండు సార్లు ఆలౌట్ చేసింది. రైడింగ్, ట్యాకిల్‌లో ముంబాను చిత్తుచేసింది. ఫస్టాఫ్‌ను 25-13 భారీ ఆధిక్యంతో ముగించింది. అయితే రెండో అర్ధభాగంలో యు ముంబా పుంజుకుంది. టైటాన్స్‌ను ఒక్కసారి ఆలౌట్ చేసింది. తెలుగు టీమ్ కూడా ప్రత్యర్థి జట్టును ఆలౌట్ చేసి లెక్క సరిచేసింది. అయితే ఫస్టాఫ్‌లోని భారీ ఆధిక్యంతో ముంబా జట్టు పోరాటం ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించింది. తెలుగు టైటాన్స్‌లో కెప్టెన్ విజయ్ మాలిక్, రైడర్ ఆశిష్ నర్వాల్ చెరో పది పాయింట్లతో సత్తాచాటారు. యు ముంబా జట్టులో రైడర్లు మంజీత్ ఏడు పాయింట్లు, అజిత్ చౌహాన్ ఆరు పాయింట్లతో పోరాడారు. అంతకుముందు నొయిడా వేదికగా జరిగిన మరో మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్‌పై యూపీ యోధాస్ 33-29 తేడాతో విజయం సాధించింది. తొలి అర్ధభాగంలో ఇరు జట్లు హోరాహోరీగా పోటీపడ్డాయి. యూపీ యోధాస్‌పై ఒక్క పాయింటు ఆధిక్యంతో ఫస్టాఫ్‌ను 20-19తో జైపుర్ పింక్ పాంథర్స్ నిలిచింది.ఇరు జట్లు చెరో సారి ఆలౌటయ్యాయి. అయితే సెకండ్ హాఫ్‌లో జైపుర్ అదే జోరును కొనసాగించలేకపోయింది. యూపీ యోధాస్ జోరుగా పాయింట్లు సాధించి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. యూపీ జట్టులో భవానీ రాజ్‌పుత్ 8 పాయింట్లు, గగన్ గౌడ 6 పాయింట్లతో సత్తాచాటారు. జైపుర్ జట్టులో కెప్టెన్ అర్జున్ దేశ్‌వాల్ 6 పాయింట్లతో పోరాడాడు. కాగా, ఇవాళ నొయిడా వేదికగా రాత్రి 8 గంటలకు తమిళ్ తలైవాస్‌తో హర్యానా స్టీలర్స్, రాత్రి 9 గంటలకు గుజరాత్ జెయింట్స్‌తో పుణెరి పల్టాన్ తలపడనున్నాయి.

# ఇక్కడ కూడా అతడి డామినేషనేనా..

ముంబై: ఐపీఎల్ వేలం తర్వాత టీమిండియా క్రికెటర్ల సంపాదనపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఇటీవల జరిగిన మెగా వేలంలో కుర్ర క్రికెటర్లకు ప్రధాన్యం ఇచ్చిన ఫ్రాంచైజీలు భారీ ప్యాకేజీలతో వారిని కొనుగోలు చేశారు. అయితే, ఇప్పటివరకు భారత క్రికెట్లో అత్యధిక సంపాదన కలిగిన క్రికెటర్‌గా విరాట్ కోహ్లీ పేరు ఉండేది. తాజాగా నంబర్ వన్ స్థానం నుంచి నంబర్ 2 స్థానానికి కింగ్ కోహ్లీ పడిపోయాడు. అతడి స్థానంలో స్టార్ వికెట్ కీపర్ రిషభ్ పంత్ వచ్చి చేరాడు. పంత్ ను ఏకంగా రూ. 27 కోట్లకు లక్నో జట్టు కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. ఇక అతడి తోటి ఆటగాళ్లు శ్రేయస్ అయ్యర్ రూ. 26.75, వెంకటేశ్ అయ్యర్ రూ. 23.75 లక్షల వంటి భారీ ధరకు అమ్ముడై టాప్ 3లో నిలిచారు. విరాట్ కోహ్లీని రూ. 21 కోట్లు చెల్లించి ఆర్సీబీ జట్టు అట్టిపెట్టుకుంది. దీంతో ఇప్పుడు ఈ క్రికెటర్లు ఒక్క ఐపీఎల్ మాత్రమే కాకుండా మొత్తంగా ఎంత సంపాదిస్తున్నారు అనే విషయాన్ని పరిశీలిస్తే.. ఇక్కడ కూడా పంత్ డామినేషనే కనపడుతోంది. పంత్ ఏడాదికి మొత్తంగా రూ. 32 కోట్లు సంపాదిస్తుండగా విరాట్ కోహ్లీ సంపాదన రూ. 28 కోట్లుగా ఉంది. ఐపీఎల్ తో పాటు బీసీసీఐ కాంట్రాక్టు ద్వారా కూడా వీరు ఈ మొత్తం అందుకుంటున్నారు. సెంట్రల్ కాంట్రాక్టు ద్వారా పంత్ ఏడాదికి రూ. 5 కోట్లు ఆర్జిస్తున్నాడు. ఐపీఎల్ ఇతడికి రూ. 27 కోట్లు ముట్టజెప్పనుంది. మొత్తం కలిపి రూ. 32 కోట్లు. మూడు ఫార్మాట్లలోనూ పంత్ ను కీలక ప్లేయర్ గా భావిస్తున్న బీసీసీఐ త్వరలోనే అతడిని ఎ ప్లస్ ఆటగాళ్ల జాబితాలో చేర్చే అవకాశాలున్నాయి. బీసీసీఐ కాంట్రాక్టు ద్వారా ఎ ప్లస్ క్యాటగిరీ కి చెందిన కోహ్లీ రూ. 7 కోట్లు సంపాదిస్తున్నాడు. ఆర్సీబీ జట్టు అతడికి రూ. 21 కోట్లు చెల్లించనుంది. మొత్తం రూ. 28 కోట్లు. అయితే, వచ్చే ఏడాది మార్చిలో బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్టు



కొత్త ప్రకటన తర్వాత పంత్ సంపాదన మరింత పెరగనుంది. టీ20 స్క్వాడ్ నుంచి కోహ్లీ తప్పుకోవడంతో వార్షిక పారితోషకంలోనూ కోత పడింది. ఇక యువ క్రికెటర్లు శ్రేయాస్ అయ్యర్, వెంకటేశ్ అయ్యర్ వంటి ఆటగాళ్లిద్దరూ సెంట్రల్ కాంట్రాక్టులో భాగం కాదన్న సంగతి తెలిసిందే. దీంతో ఒక వేళ శ్రేయాస్ అయ్యార్ తిరిగి భారత జట్టులో చేరితే అతడు ఈ కాంట్రాక్టులో చేరే అవకాశం ఉంది.



## పంత్, అయ్యర్ కాదు..

# ఐపీఎల్‌లో అత్యధిక ప్యాకేజ్ ఇతడికే..

టీమిండియా వికెట్ కీపర్, బ్యాటర్ జితేష్ శర్మ సరికొత్త రికార్డు క్రియేట్ చేశాడు. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక శాలరీ హైక్ అందుకుంటున్న ఆటగాడిగా అతడు నిలిచాడు. గత ఐపీఎల్‌లో జితేష్ శాలరీ రూ.20 లక్షలు. కానీ వచ్చే సీజన్‌లో అతడు ఏకంగా రూ.11 కోట్లు అందుకోనున్నాడు. ఆర్సీబీ జట్టు అతడ్ని ఇంత భారీ మొత్తం వెచ్చింది వేలంలో దక్కించుకుంది. గత ఐపీఎల్‌తో పోలిస్తే నెక్ట్స్ సీజన్ కోసం ఏకంగా 55 రెట్ల అధిక వేతనాన్ని పొందనున్నాడు జితేష్. మొత్తంగా అతడి శాలరీ హైక్ 5500 శాతంగా ఉంది. సెకండ్ ప్లేస్‌లో పంజాబీ పుత్తర్ ఈసారి ఆక్షన్‌లో భారీ ధర పలికిన రిషబ్ పంత్, శ్రేయస్ అయ్యర్, వెంకటేశ్ అయ్యర్ కంటే జితేష్ శర్మనే ఎక్కువ ప్యాకేజీ అందుకోనున్నాడు. ఐపీఎల్-2022 వేలంలో శ్రేయస్‌ను రూ.12.25 కోట్ల ధరకు కేకేఆర్ దక్కించుకుంది. తాజా వేలంలో పంజాబ్ అతడ్ని రూ.26.75 కోట్లకు సొంతం చేసుకుంది. అంటే మునుపటి శాలరీ కంటే అతడు మరో రూ.14.50 కోట్లు ఎక్కువ అందుకోనున్నాడు. అంటే సుమారుగా 200 శాతం శాలరీ హైక్ ఇస్తున్నారు. కానీ జితేష్‌కు అలా కాదు.. అతడి శాలరీ హైక్ ఏకంగా 5500 శాతంగా ఉంది. అతడి తర్వాతి స్థానంలో అర్ష్‌దీప్ సింగ్ ఉన్నాడు. ఈసారి వేలంలో రూ.18 కోట్ల ధర పలికిన ఈ పేసర్ గత ఐపీఎల్ శాలరీ రూ.4 కోట్లు. గత సీజన్‌తో పోలిస్తే మరో రూ.14 కోట్లు ఎక్కువ అందుకోనున్నాడీ పంజాబీ పుత్తర్. అతడికి సుమారుగా 3500 శాతం శాలరీ హైక్ జరిగిందని చెప్పొచ్చు.

# సంక్షేమ హాస్టళ్లను గత ప్రభుత్వం పట్టించుకోలేదు



బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై మంత్రి కొండా సురేఖ సంచలన ఆరోపణలు చేశారు. గురుకులాల్లో కుట్రల వెనుక ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హస్తం ఉందని ఆమె ఆరోపించారు. గతంలో ఆయన గురుకులాల కార్యదర్శిగా పని చేశారని గుర్తు చేశారు. తన అనుచరులనే సిబ్బందిగా నియమించుకున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో గురుకులాల కుట్రల వెనుక ఆయన హస్తం ఉందన్నారు. ఈరోజు ఆమె మీడియాతో మాట్లాడుతూ... సంక్షేమ హాస్టళ్లను గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. హాస్టళ్లలోని విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దే బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక హాస్టల్లో ఓ విద్యార్థిని చనిపోయిందన్నారు. బాధిత విద్యార్థినికి ప్రత్యేక వైద్య సదుపాయం అందించామన్నారు. దురదృష్టవశాత్తూ చనిపోయిందన్నారు. ఆమె మృతిపై రాజకీయం చేయవద్దని కోరారు. బీఆర్ఎస్ హయాంలో హాస్టళ్లలో భోజనంలో పురుగులు వచ్చేవన్నారు. సంక్షేమ హాస్టళ్లలో సదుపాయాలు కొరవడినా బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. విద్యార్థిని మృతిని రాజకీయం చేయవద్దని కోరారు.

**అందుకే కేటీఆర్ పదేపదే జైలుకు పోతా అంటున్నాడు**

కేటీఆర్ ఏదో తప్పు చేసినట్లున్నాడని, అందుకే జైలుకు పోతానని పదేపదే అంటున్నాడని మంత్రి అన్నారు. గిరిజనుల కోసం జైలుకు పోతానంటున్నాడు... మూసీ నది కోసం జైలుకు పోతానని అంటున్నాడు... కానీ తాను చేసిన తప్పులకు జైలుకు పోతానని కేటీఆర్‌కు తెలుసు... అందుకే ప్రజల కోసం జైలుకు పోతానని అంటున్నాడని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో తాను కూడా ఎమ్మెల్యేగా ఉన్నానని, కానీ కేసీఆర్ లేదా కేటీఆర్ ఎప్పుడైనా ఎమ్మెల్యేలను కలిసి సమస్యలు విన్నారా? అని ప్రశ్నించారు. కనీసం వారు మంత్రులకు కూడా దొరకలేదని విమర్శించారు. కానీ ఈరోజు నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. ప్రజలు ఐదేళ్లు పాలించాలని అధికారం ఇస్తే ప్రభుత్వాన్ని దింపుతానని సైకోరావు అనడం విడ్డూరమని కేటీఆర్‌ను ఉద్దేశించి అన్నారు. కానీ తాను చేసిన తప్పులకు జైలుకు పోతానని కేటీఆర్‌కు తెలుసునన్నాడు

# ఈ కాంగ్రెస్ ప్రభుత్వం లేకి బుద్ధితో వ్యవహరిస్తోంది

-మొదటిపేజీ తరువాయి

నృత్య రూపాలు, చిత్రకళలు, చరిత్ర పాఠాలు, శిలాశాసనాలు ఎన్నెన్నో రకాలుగా ఘనమైన సంస్కృతిని, మహనీయులను, వైతాళికులను గుర్తు చేసుకునే విధంగా మనకు ఉపయోగపడ్డాయని కేటీఆర్ తెలిపారు.

ఏ జాతి అయితే తన చరిత్రను విస్మరిస్తుందో ఆ జాతి పరాయి పెత్తనంలో బానిసగా మారిపోతోంది. ఒక ప్రాంతాన్నో, ఒక దేశాన్నో ఓడించి వశం చేసుకున్న విజేతలు.. పరాజితుల చరిత్రను చెరిపేసే ప్రయత్నం చేస్తారు. మానసిక దాడి చేసి లొంగదీసుకునే ప్రయత్నం చేస్తారు. బ్రిటీష్ వారి నుంచి మొదలుకుంటే సమైక్యాంధ్ర శక్తుల దాకా ఇదే ప్రయోగం చేశారు. తెలంగాణ భావజాలం మీద కూడా అనేక దాడులు జరిగాయి. ఆంధ్రా %-% తెలంగాణ పంచాయితీలు, హైదరాబాద్ అట్టుడికిపోతుందని, తెలంగాణ నాయకత్వానికి పరిపాలన సమర్థత లేదని దాడి జరిగింది. కానీ వాటన్నింటిని పటాపంచలు చేస్తూ కేసీఆర్ ముఖ్యమంత్రిగా భారతదేశంలో తెలంగాణ నవంబర్ వన్‌గా నిలబెట్టారు అని కేటీఆర్ గుర్తు చేశారు.

ఒక జాతి సంక్షోభంలో ఉన్నప్పుడు తల్లడిల్లుతున్నప్పుడు ఒక యోధుడు పుడుతాడు. ఆ యోధుడు స్పార్టకస్, గాంధీ, మార్టిన్ లూథర్ కింగ్, నెల్సన్ మండేలా.. ఎవరో ఒకరు పుట్టి.. ఆ జాతిని మేల్కొలిపితే కదిలి మళ్లీ తిరిగి స్వాతంత్ర్యం సాధించుకున్నారు. ప్రతి దేశానికి, ప్రాంతానికి, జాతికి ఒక




కథ ఉంటుంది. ఒక కథా నాయకుడు ఉంటాడు. ప్రతినాయకులు ఉంటారు. త్యాగాలు, విద్రోహాలు ఉంటాయి. జయాలు, అపజయాలు ఉంటాయి. ఎదురుదెబ్బలు, గుణపాఠాలు ఉంటాయి. అలాగే తెలంగాణ కథలో కూడా ఉన్న ఒక్క కథా నాయకుడు కలిసొచ్చే కాలానికి నడిపొచ్చే కొడుకు 2001లో గులాబీ జెండాతో తెలంగాణ తల్లికి జన్మనిచ్చిన తనయుడు కేసీఆర్ గారి రూపంలో మన ముందుకు వచ్చాడు. మన కథను తెలంగాణ జాతి వ్యథను రేపటి తరానికి నరనరాన ఎక్కించాల్సిన బాధ్యత ఉన్నది. లేకపోతే మళ్లీ మన తెలంగాణ జాతి పరాయి దండయాత్రలో ఓడిపోయే ప్రమాదం ఉన్నది. అది కాంగ్రెస్ ప్రభుత్వం దాడి రూపంలో మనకు కనబడుతుందని కేటీఆర్ అన్నారు.

**కాంగ్రెస్ ప్రభుత్వానిది లేకి బుద్ధి.. నిప్పులు చెరిగిన కేటీఆర్**

హైదరాబాద్ : తెలంగాణలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం లేకి బుద్ధితో వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. దీక్షా దివస్ సందర్భంగా తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ప్రసంగించారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం లేకి బుద్ధితో వ్యవహరిస్తోంది.. బంజారా ఆడబిడ్డలు తమ వేషధారణలో సంప్రదాయంగా దీక్షా దివస్‌లో పాల్గొనడానికి వస్తుంటే క్యాన్సర్ హాస్పిటల్ నుంచి ఇక్కడి వరకు వీధి దీపాలు ఆర్పేశారు. అంతేకాకుండా బీఆర్ఎస్ ఫ్లెక్సీలు చింపేశారు. ఈ ప్రభుత్వానిది లేకి బుద్ధి అని అర్థమవుతోంది. కాంగ్రెస్ తన చిల్లర బుద్ధిని రుజువు చేసుకుంది. మనం ఎవర్నో తిట్టడానికి విమర్శించడానికి ఈ కార్యక్రమం పెట్టుకోలేదు అని కేటీఆర్ తెలిపారు.

నిన్న ఏదారిలో నడిచి వచ్చామో తెలుసుకోకపోతే రేపు ఏ బాటలో నడవాలో అర్థం కాదు. కాబట్టి చరిత్రలను అర్థం చేసుకోకుండా భవిష్యత్‌ను నిర్మించలేం. గతం తెలుసుకోకుండా గమ్యాన్ని చేరుకోలేం. ఈ తరం పిల్లలకు తెలంగాణ ఉద్యమ చరిత్ర, కేసీఆర్ భూమిక తెలియజేప్పే బాధ్యత మనందరిది. ఇప్పటి తరానికి తెలంగాణ సాధించిన వ్యక్తిగా, తొలి ముఖ్యమంత్రిగా కేసీఆర్ తెలియొచ్చు. కానీ పోరాటాలు, త్యాగాల చరిత్ర, విద్యార్థి అమరవీరుల త్యాగం కూడా తెలియాలని కేటీఆర్ అన్నారు.

# హైదరాబాద్‌లో ఊపిరి తీస్తున్న గాలి



**హైదరాబాద్ :** మహానగరంలో పొల్యూషన్‌తో మానవ మనుగడకు ప్రమాదం పొంచి ఉంది. నగరంలో పెరుగుతున్న జనాభా దృష్ట్యా రోజురోజుకు వాహనాలు పెరుగుతున్నాయి. దీంతో పొల్యూషన్ అత్యధిక స్థాయిలో రికార్డు అవుతోంది. మరీ ముఖ్యంగా సెకండ్ హ్యాండ్ వాహనాలు, డీజిల్ వాహనాల ద్వారా ఎక్కువగా కాలుష్యం నమోదవుతోంది. పొల్యూషన్ కారణంగా శ్వాసకోస ఇబ్బందులతో మృతుల సంఖ్య నానాటికి పెరుగుతోంది. నగరంలో వాయు కాలుష్యం కారణంగా గత 10 ఏళ్లలో 6వేల మందికి పైగా చనిపోయారని గణాంకాలు చెబుతున్నాయి. రీసెంట్‌గా ప్రముఖ ఆరోగ్య జర్నల్ ది లాన్సెట్ ప్లానెట్ విడుదల చేసిన రిపోర్ట్ ప్రజలను ఆదోంళనకు గురిచేస్తోంది. లాస్ట్ ఇయర్ 2023లోనే కాలుష్యంతో 1,597మంది మరణించినట్లు లాన్సెట్ లెక్కలు చెబుతున్నాయి.తెలంగాణలో రవాణా శాఖ లెక్కల ప్రకారం 2024 మే 31 నాటికి మొత్తం వాహనాలు ఒక కోటి 65 లక్షల 65 వేల 130 వాహనాలు ఉన్నట్లు రవాణాశాఖ చెబుతోంది. ఒక్క గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే సుమారు 80 లక్షలకు పైన వాహనాలు తిరుగుతున్నట్లు అధికారుల లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. వాటి నుంచి రోజుకు 1500 టన్నులకు పైగా కాలుష్యకారకాలు విడుదలవుతున్నాయని సంబంధిత అధికారులు వెల్లడించారు. దీంతో చర్యలు చేపట్టింది ప్రభుత్వం.కాలుష్యాన్ని నియంత్రించేందుకు 15 ఏళ్లు దాటిన వాహనాలను స్వచ్ఛందంగా స్క్రాప్‌కు తరలించాలని సూచిస్తున్నారు రవాణా శాఖ అధికారులు. హైదరాబాద్ నగరంలో ఢిల్లీ తరహా కాలుష్య పరిస్థితులు రావొద్దనే ముందస్తు చర్యలు చేపడుతున్నారు. భవిష్యత్తు తరాల దృష్ట్యా ఈవీ కొత్త పాలసీని తీసుకొచ్చింది ప్రభుత్వం. అత్యధిక స్థాయిలో ఈవీ రాయితీ ఇస్తోంది. రోడ్డు, రిజిస్ట్రేషన్ ట్యాక్స్ లో 100శాతం మినహాయింపులు ప్రకటించింది. అంతేకాకుండా చార్జింగ్ స్టేషన్లు మెరుగుపరచడానికి చర్యలకు చేపట్టింది. రాష్ట్రంలో కొత్తగా 6వేల ఎలక్ట్రిక్ వాహన చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ దిశగా తెలంగాణ రెడ్‌కో కసరత్తు వేగవంతం చేసింది. ప్రభుత్వ చర్యలతో రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వెహికల్స్ వాడకం పెరుగుతోంది. దాదాపుగా ఇప్పటివరకు 1 లక్షా70వేల ఎలక్ట్రిక్ వాహనాలు రిజిస్ట్రేషన్ పూర్తయ్యాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎక్కువగా టూ, త్రీ, ఫోర్ వీలర్ ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలు చేసేందుకు ప్రజలు ఇంట్రెస్ట్ చూపుతున్నట్లు తెలుస్తోంది. ఇది ఇలాగే కొనసాగితే రాష్ట్రంలో.. హైదరాబాద్లో వాయు కాలుష్యం కొంత మేర తగ్గించవచ్చని అధికారులు భావిస్తున్నారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని కొత్తగా వెహికల్ కొనాలని ఆలోచన ఉన్నవారు ఈవీ వైపు మొగ్గుచూపాలని సూచిస్తున్నారు అధికారులు.

సనత్ నగర్ ప్రాంతం... మహానరకం

స్వచ్ఛమైన వాతావరణంలో, గాలిలో సూక్ష్మ దూళి కణాల స్థాయి క్యూబిక్ మీటర్‌కు 50 మైక్రోగ్రాముల లోపు ఉండాల్సి ఉండగా సనత్ నగర్ పారిశ్రామిక ప్రాంతంలో 255 నుంచి 300 మైక్రోగ్రాములుగా నమోదవుతుంది. దీంతో ఈ ప్రాంతంలో ఎక్కువ మంది శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఎదుర్కొనే అవకాశం ఉన్నట్లు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి గణాంకాలు చెబుతున్నాయి. సనత్ నగర్ ఏరియాలలో ఈ నెల 22, 23, 24, 25 తేదీల్లో గాలి నాణ్యత ప్రమాదకర స్థాయికి చేరింది. ఆ తేదీల్లో 254, 253, 274, 298 గా నమోదైంది. మరో వైపు సిటీలోని ఇతర ప్రాంతాల్లోనూ ఎయిర్ క్వాలిటీ పడిపోతుంది. కొన్ని ఏరియాల్లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ మోడరేట్‌గా నమోదవుతున్నది. వాస్తవానికి గాలివాటాన్ని బట్టి గాలి నాణ్యత పెరగడం, తగ్గడం ఉంటుంది. ఒకచోట నమోదయ్యే వాల్యూస్ ఆ ప్రాంత చుట్టుపక్కల నాణ్యతను కూడా సూచిస్తాయి. ఈ లెక్కన నగరంలో చలికాలం గాలి నాణ్యత సరిగ్గా ఉండడం లేదని చెప్పవచ్చు.మరోవైపు బొల్లారం పారిశ్రామిక వాడలో 118, హెచ్‌సీయూ ప్రాంతంలో 128, పటాన్ చెరువులో 151, పాశమైలారంలో 126, సోమాజిగూడలో 121, జూపార్కు వద్ద 102 మైక్రో గ్రాములు ఉంటున్నట్లు అధికారిక లెక్కలు చెపుతున్నాయి.కాలుష్యాన్ని నివారించేందుకు నగరం లోపల, వెలుపల ఉన్న పరిశ్రమలతో వాయు కాలుష్యానికి సంబంధించిన పర్యావరణానికి అనుకూలమైన టెక్నాలజీని ఉపయోగించాలి. సోలార్, విండ్ పవర్ వంటి పునరుత్పత్తి వనరులను ప్రోత్సహించాలి. ప్రతి సంవత్సరం వాయు కాలుష్యాన్ని నివారించేందుకు వీలవుతుందని వాతావరణ కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు చెబుతున్నారు. కాలం చెల్లిన పాత వాహనాలకు రహదారపై తిరగకుండా చూడడం, కొత్త వాహనాలకు ఎమిషన్ ప్రమాణాలను కఠినంగా అమలు చేయడం అవసరమని పీసీబీ స్పష్టం చేసింది. నగరంలో మొక్కలు నాటడం, పచ్చని ప్రదేశాలను పెంపొందించడం ద్వారా వాయు నాణ్యత మెరుగుపరవచ్చని తెలిపింది. ప్రజలకు వాయు కాలుష్యం వల్ల జరిగే హాని, దాని ప్రభావాలు, నివారణ మార్గాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించింది. ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని పీసీబీ హెచ్చరిస్తుంది. ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించాలని, పాత పరిశ్రమలను ఆధునికీకరించి కాలుష్యాన్ని తగ్గించడానికి మార్పులు చేయాలని సూచించింది.. పొల్యూషన్లో కార్బన్ మోనాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్, నైట్రస్ ఆక్సైడ్ వంటివి ఉంటాయి. పార్టీ ప్లేట్ మేటర్స్ పీలుస్తున్నప్పుడు అప్పర్ రెసిపీలో ఫిల్టర్ అవుతుంటాయి. వింటర్ సీజన్లో గాలిలో తేమ ఎక్కువగా ఉంటుంది. దాంతో కార్బన్ డయాక్సైడ్ ఒకే దగ్గర కాన్సన్ట్రేట్ అవుతూ ఉంటుంది. ట్రాఫిక్ కానిస్టేబుల్స్ గాని, రెగ్యులర్‌గా డ్రైవింగ్ చేసేవారు కానీ, రోడ్డుపై వీధి వ్యాపారాలు చేసేవారు కానీ పొల్యూషన్ బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంది. వారు ఎక్కువగా జాగ్రత్తగా ఉండటం మంచిదని" డాక్టర్ ప్రమోద్ కుమార్ తెలిపారు.ఎక్కువగా పొల్యూషన్ బారిన పడే వారికి ఎలర్జిక్ రైనాయిటీస్ అనే ఒక జబ్బు ఎక్కువగా వస్తూ ఉంటుంది. తుమ్ములు రావడం, ముక్కు కారడం, ముక్కలు బ్లాక్ కావడం లాంటి సింటమ్స్ ఉంటాయి. ఒకసారి ఎక్కువ రోజులు ఉండటం వల్ల వేరే ఇబ్బందులు కూడా వచ్చే అవకాశాలు ఉన్నాయి. లంగ్స్‌లో బ్లాక్ ఐటీస్ అనేది కూడా వస్తుంది. ఆ తర్వాత ఊపిరితిత్తులలో నిమోనియాగాని, సీఓపీడీ గాని వచ్చే అవకాశాలు ఉన్నాయి. తేమ ఎక్కువగా ఉండటం వల్ల చలికాలంలో వైరల్ ఇన్ఫెక్షన్‌లు, బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్‌లు ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ చలికాలం బ్యాక్టీరియా ఎక్కువగా గాల్లో తేలాడుతూ ఉంటుంది ఆ సమయంలో ఆ గాలి పీల్చడం వల్ల ఇన్ఫెక్షన్లు ఆల్రెడీ జబ్బు ఉన్న వాళ్లపై ఎక్కువ ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయి. చిన్నపిల్లలలో ఎక్కువగా వైరల్ ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశాలు ఉన్నాయి. పిల్లలకు ఎలర్జీ ప్రాబ్లమ్‌లు కూడా ఎక్కువగా ఈ మధ్య వస్తున్నాయి. పిల్లలలో ఇమ్యూనిటీ పవర్ తక్కువగా ఉండటంలో ఎక్కువ శాతం ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశాలు ఉన్నాయి. క్రానిక్ అబ్స్ట్రక్టివ్ పల్మోనాలజీ డిసీజ్ ఎక్కువగా స్మోకింగ్ చేసే వాళ్ళకి వస్తుంది. స్మోకింగ్ చేస్తూ ఇటువంటి పొల్యూషన్ ఎక్కువైనప్పుడు ఆ ప్రాబ్లం ఇంకా ఎక్కువ అయ్యే అవకాశం ఉంటుంది. పొల్యూషన్ వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశాలు కూడా ఎక్కువగా ఉంటాయి. తప్పకుండా కంటిన్యూగా ఎక్స్పోజింగ్ అయ్యే వాళ్ళు మాస్క్ ఖచ్చితంగా ధరించాలని డాక్టర్ ప్రమోద్ కుమార్ సూచించారు.

## సంక్రాంతికి రైతు భరోసా

-మొదటిపేజీ తరువాయి

వేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు.

**తెలంగాణ సర్కార్ సంచలన నిర్ణయం..**

కేసీఆర్ 10 ఏళ్లలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పేదలకి ఇవ్వలేదని విమర్శించారు. వచ్చే నెలలో ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభిస్తామని తెలిపారు. 7 లక్షల కోట్లు అప్పు చేసి కాళేశ్వరం కడతా అని చెప్పి కూలిపోయే కాళేశ్వరం కట్టారని విమర్శించారు. వచ్చే మూడేళ్లలో ప్రతీ ఊరికి బీటీ రోడ్ వేస్తామని.. మండలం నుంచి జిల్లా కేంద్రానికి రహదారి విస్తరణ చేస్తామని వెల్లడించారు. ప్రభుత్వం వచ్చిన మూడో రోజు నుంచే బావ బామ్మర్ది ప్రజా ప్రభుత్వం పడిపోతుందని విమర్శిస్తున్నారంటూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

**దీక్షా దివస్‌పై కౌంటర్..**

అలాగే.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దీక్షా దివస్‌పై మంత్రి కోమటిరెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. “ఇందాక ఎక్కడోకాయన కేసీఆర్ బొమ్మ పెట్టి దీక్షా దివస్ అని పోస్టర్ చుసిన.. బీఆర్ఎస్ నేతల హడావిడి చూస్తే నవ్వాలో ఏడవాలో అర్థం కావడం లేదు. అయన గ్లూకోజులు, విటమిన్స్ తీసుకుంటూ చేసిన దీక్షకు కూడా ఇంత బిల్డప్ ఇస్తారా? కేసీఆర్ దీక్షలో ఏం తీసుకున్నారో మా గోనె ప్రకాష్ రావుని అడిగితే కుల్ల కుల్ల చెప్తడు” అంటూ కామెంట్స్ చేశారు. కేసీఆర్ ది నకిలీ దీక్ష అంటూ వ్యాఖ్యలు చేశారు. బూస్ట్ తాగుతూ, సెలైన్లు, విటమిన్స్ తింటూ దీక్ష చేసి పెద్ద త్యాగం చేసినట్టు సీన్ క్రియేట్ చేస్తున్నారని మండిపడ్డారు. కానిస్టేబుల్ కిష్టయ్యది, శ్రీకాంతాచారి ది నిజమైన త్యాగమన్నారు. తెలంగాణ ఏర్పాటు సోనియా గాంధీ నిర్ణయంతో జరిగిందన్నారు. “నేను నల్గొండ చౌరాస్తలో 11 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేశాను. కేసీఆర్ లాగా ఎప్పుడు ప్రచారం చేసుకోలే. మూడేండ్లు మంత్రి పదవి ఉండగా నేను రాజీనామా చేశాను” అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు.

**కేసీఆర్‌ది ఫేక్ దీక్ష: గోనే ప్రకాష్**

అలాగే కేసీఆర్ దీక్షపై మాజీ ఎమ్మెల్యే గోనే ప్రకాష్ రావు కూడా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేసీఆర్ చేసింది ఫేక్ దీక్ష అని.. దీక్ష సమయంలో జ్యూస్లు, మెడిసన్లు తీసుకున్నారన్నారు. రాష్ట్ర ఇంటలిజెన్స్, సెంట్రల్ ఇంటెలిజెన్స్ వైఫల్యం చెందిందని తెలిపారు. కేసీఆర్ ఫ్లూయిడ్స్ తీసుకుంటున్నారని అప్పుడే మీడియాకి తెలిపానని.. హరీష్ రావు చస్తా అని బెదిరించి పెట్రోల్ పెట్టుకున్నారు కానీ అగ్గిపెట్టే లేదన్నారు. కేసీఆర్ ఉద్యమ కారులను రెచ్చిగొట్టి 1200 ప్రాణాలు తీశారని ఆరోపించారు. “రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను, కేసీఆర్ దొంగ దీక్ష దివాస్‌పై కమిటీ వేసి దర్యాప్తు జరపాలి” అని డిమాండ్ చేశారు. మొదటి అసెంబ్లీ లో 1200 మంది చనిపోయారని చెప్పారని.. తెలంగాణ ఉద్యమంలో చనిపోయిన అమరవీరుల కుటుంబాలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల నుంచి దీక్ష దివాస్ పేరుట బీఆర్ఎస్ హడావుడి చేస్తోందన్నారు. తెలంగాణ జాగృతి పేరిట కవిత ఈరోజు రంగ ప్రవేశం చేస్తున్నారన్నారు. కేసీఆర్ దొంగ దీక్షను బయటపెడతామని గతంలో జైపాల్ రెడ్డి చెప్పారని ఈ సందర్భంగా గోనె ప్రకాష్ రావు గుర్తుచేశారు.

## లగచర్ల భూసేకరణ రద్దు

-మొదటిపేజీ తరువాయి

స్థానిక రైతులు తీవ్రంగా వ్యతిరేకించిన సంగతి తెలిసిందే. ఈ నెల 11న వికారాబాద్ జిల్లా కలెక్టర్ సహా ఇతర అధికారులు ప్రజల అభిప్రాయ సేకరణ కోసం గ్రామానికి చేరుకోగా వారిపై స్థానిక రైతులు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో వెంకట్ రెడ్డి అనే ప్రత్యేక అధికారి తీవ్రంగా గాయపడ్డారు. అంతేకాకుండా, కలెక్టర్ సహా ఇతర అధికారుల వాహనాలు కూడా ధ్వంసం అయ్యాయి. ఘటనపై రేవంత్ ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేయగా.. మొత్తం19 మంది రైతులను నిందితులుగా గుర్తించి అరెస్ట్ చేశారు.

## గ్రామ స్థాయి నాయకుల కృషి ఫలితమే



**హైదరాబాద్ :** గ్రామ స్థాయి నాయకుల కృషి ఫలితమే..నేడు రాష్ట్రము లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ. మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.శుక్రవారం ఇందిరా భవన్ లో జరిగిన పంచాయతీ రాజ్ సంఘటన్ సమావేశం లో పాలోని ప్రసంగించారు.తెలంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందంటే అది గ్రామ స్థాయి నాయకుల కృషి ఫలితమే.. అనుబంధ సంఘాల చైర్మన్ లలో చాలా మంది కార్పొరేషన్ చైర్మన్ లుగా చేసాము. సేవాదల్, ఆర్.జి.పీఆర్.ఎస్ లు రాహుల్ గాంధీకి చాలా ఇష్టం..ఇది రాజీవ్ గాంధీ కి గ్రామ పంచాయతీ లు అంటే ఇష్టం..73, 74 రాజ్యాంగ సవరణ తోనే గ్రామాలకు హక్కులు వచ్చాయి. ఇది రాజీవ్ గాంధీ గారి కృషి. పివి నరసింహ రావు వీటిని అమలు చేశారు.దీని వల్లనే పంచాయితీ లకు గౌరవం వచ్చిందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీ లను నిర్లక్ష్యం చేసింది. బిల్లులు ఇవ్వకపోవడంతో సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారు కులగణన చాలా ముఖ్యం. ఇది రాహుల్ గాంధీ ఆలోచన..దీని వల్లనే పేదలకు న్యాయం జరుగుతుంది. ఆధాని, అంబానిలను బీజేపీ పెంచి పోషిస్తుంది మన రాష్ట్రంలో కులగణన సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించడం హర్షనీయం. రాజీవ్, రాహుల్, సోనియాగాంధీ లకు పదవుల మీద ఆశ లేదు.మోడీ కి ఫొటోల పిచ్చి.. పెద్దల కోసం ధన వంతుల కోసం బీజేపీ పని చేస్తుంది. బీజేపీ కేంద్రంలో ఇచ్చిన ఒక్క హామీ నెర వేర్చలేదు. ఈ దేశాన్ని ప్రైవేట్ పరం చేసేందుకు మోడీ కుట్ర చేస్తున్నారని విమర్శించారు.దేశాన్ని కాంగ్రెస్ కాపాడుతుంటే బీజేపీ అమ్మేస్తుంది కాంగ్రెస్ పార్టీ లో పంచాయతీ సంఘటన్ చాలా ప్రాముఖ్యత ఉంది వచ్చే లోకల్ బాడీ ఎన్నికలలో గెలవాలి. వ్యక్తుల ప్రభావం అధికంగా ఉండే పంచాయతీ ఎన్నికల్లో మీరు గెలవాలి. సంస్థ ఇంకా బలోపేతం చెయ్యాలి.. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇచ్చినప్పుడు.. జనం కేసీఆర్ కు సిఎం గా అవకాశం ఇచ్చారు బంగారు తెలంగాణ అని ప్రజలను మోసం చేశారు.కేసీఆర్ కుటుంబం బంగారు కుటుంబం గా మారింది.. తెలంగాణను బాగా దోచుకున్నారుతెలంగాణ లో 8 లక్షల కోట్ల అప్పు చేశారు.ఇప్పుడు మనం కేసీఆర్ చేసిన అప్పుకు వడ్డీ కడుతున్నామన్నారు..రైతు రుణ మాఫీ, రైతు బంధు, బోనస్ ఇచ్చినం, ఉద్యోగాలు ఇచ్చినం, 200 యూనిట్ల కరెంట్ ఇచ్చాము, 500 రూపాయల గ్యాస్ ఇచ్చాము, ఆరోగ్య శ్రీ ఇచ్చాము.. అన్ని ప్రజలకు వివరించాలి..మనం చేసిన పనులను ప్రజలకు వివరించాలి.. నిజమైన పేదవాళ్లకు ప్రభుత్వ ఫలాలు అందినపుడే మన లక్ష్యం నెరవేరుతుందన్నారు.

## అత్యంత నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లలో తొలి ప్రాధాన్యం

-మొదటిపేజీ తరువాయి

ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్‌లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఏ దశలోనూ లబ్ధిదారులకు ఇబ్బంది కలగవద్దని.. అదే సమయంలో శాఖాపరంగా ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా చూడాలని సూచించారు. ఆదివాసీ ప్రాంతాలు, ఐటీడీఏల పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ప్రత్యేక కోటా ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు అదనంగా గదులు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపితే అందుకు అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం సమర్థమంతంగా కొనసాగించేందుకు వీలుగా గృహ నిర్మాణ శాఖ బలోపేతం కావాలని, ఇందుకు అవసరమైన అధికారులు, సిబ్బందిని నియమించుకోవాలని శాఖ ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.

Editor, printed and owned by Bommarboyina Venkanna, Association Editor K Rajendra Prasad “office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332